RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, సంపుటి 02, సంచిక 247, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12 శుక్రవారం - 12 - డిసెంబర్ - 2025 , వెల రూ.5/-



బోనకల్ నూతన గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి గారికి మరియు ఉప సర్పంచ్ బానోతు కొండ గారికి శుభాకాంక్షలు




## తెలంగాణ బీజేపీ ఎంపీలు మరింత యాక్టివ్‌గా ఉండాలి

- తెలంగాణ బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ క్లాస్
- తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించాలి
- గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే అవకాశం మిస్సయింది
- 8 మంది ఎంపీలు ఉన్న ప్రధాన ప్రతిపక్షంగా ఎందుకు ఎదగలేకపోతున్నారు?

ఢిల్లీ: తెలంగాణ బీజేపీ ఎంపీలు మరింత యాక్టివ్‌గా ఉండాలంటూ వారికి ప్రధాని నరేంద్ర మోదీ క్లాస్ పీకారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించాలన్నారు. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే మిగతా.. 2లో

## భారత్‌లో సేవలకు సిద్ధం.. ఎలాన్ మస్క్ కీలక ట్వీట్

కేంద్ర మంత్రి సింధియాతో స్టార్‌లింక్ ప్రతినిధుల కీలక భేటీ




- నగరాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలకే ప్రాధాన్యత
- త్వరలో ప్రభుత్వ అనుమతులు వస్తాయని కంపెనీ ఆశాభావం

## ఆ భారాన్ని కూటమి ప్రభుత్వమే భరించాలి: షర్మిల

కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల తీవ్ర విమర్శలు




- విద్యుత్ ఛార్జీల పెంపునకు ఏపీఈఆర్సీ సిద్ధమవుతోందని ఆరోపణ
- ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వమే విద్యుత్ భారాన్ని భరించాలని డిమాండ్

# పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు...

## తొలి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు ఎన్నికలు

### జగిత్యాలలో తల్లిపై కూతురు విజయం

### 776 మంది కాంగ్రెస్, 312 మంది బీఆర్ఎస్, 63 మంది బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు

కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లెలో తల్లి గంగవ్వపై కూతురు సుమలత 91 ఓట్లతో విజయం




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సాయంత్రానికి వెలువడిన ఫలితాల సరళిని పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లి, కుమార్తె మధ్య పోటీ నెలకొంది. రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించడంతో శివరాత్రి గంగవ్వను బీఆర్ఎస్ బలపరచగా, ఆమె కుమార్తె సుమలతను కాంగ్రెస్ బలపరిచింది. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపులో తల్లి గంగవ్వపై కుమార్తె సుమలత 91 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొదటి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగగా, ఏకగ్రీవాలతో కలుపుకుని 776 మందికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 312 మంది, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు 63 మంది, ఇతరులు బలపరిచిన 164 మంది అభ్యర్థులు విజయం సాధించారు. మొదటి విడతలో 3,834 సర్పంచ్ పదవులకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డులకు 65,455 మంది పోటీ పడ్డారు. యాదాద్రి జిల్లా లక్ష్మక్కపల్లిలో సర్పంచ్ అభ్యర్థులకు ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. లాటరీ తీయడంతో డ్రాలో బీఆర్ఎస్ మద్దతుదారు ఇండ్ల రాజయ్య విజయం సాధించారు.




## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు: సీఎం రేవంత్ రెడ్డి

- మెస్సీ హైదరాబాద్ పర్యటన ప్రైవేట్ కార్యక్రమం అని రేవంత్ వెల్లడి
- ఈవెంట్‌కు హాజరు కావాలని రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం
- ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్

## చిన్నస్వామి స్టేడియంలో మళ్లీ మ్యాచ్‌లు?..

### డీకే శివకుమార్ ఏమన్నారంటే..!




- చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు ప్రభుత్వం సానుకూలం




## అమిత్ షా నిన్న ఆందోళనగా కనిపించారు, చేతులు కూడా వణికాయి

- అమిత్ షా నిన్న కంగారుగా కనిపించారన్న రాహుల్ గాంధీ
- ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేదని విమర్శ
- నేను చేసిన వ్యాఖ్యలపై సభలో చర్చిద్దామంటే సమాధానం రాలేదని వెల్లడి

ఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిన్న ఆందోళనగా కనిపించారని, ఆయన ఉపయోగించిన భాష కూడా సరిగా లేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా నిన్న మాట్లాడిన విషయం తెలిసిందే. ఆయన ప్రసంగంపై రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అమిత్ షా నిన్న కంగారుగా కనిపించారని అన్నారు. మిగతా.. 2లో

# తాడేపల్లి వద్ద రూ.532 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం

## ప్రభుత్వ ఉద్యోగులకు రెండు విడతల కరవు భత్యం మంజూరు

- గిరిజన పాఠశాలల్లో 417 ఉపాధ్యాయ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు గ్రీన్ సిగ్నల్
- కుప్పం చెక్‌డ్యామ్ పనులకు సవరించిన అంచనాలకు ఆమోద ముద్ర
- కాలం చెల్లిన చట్టాల స్థానంలో కొత్త జైళ్ల చట్టం బిల్లుకు ఆమోదం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రహదారుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, విద్యా రంగం, జైళ్ల సంస్కరణలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. మిగతా.. 2లో



## ఆయన 'భారతరత్న'కు నిజంగా అర్హుడు

- ఆయన జీవితం నుంచి మూడు ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానన్న పవన్

అమరావతి: ప్రముఖ తమిళ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్య భారతికి భారతరత్న పురస్కారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. గురువారం సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఓ పోస్ట్ పెట్టారు. సుబ్రహ్మణ్య భారతి భారతరత్నకు అన్ని విధాలా అర్హుడని పవన్ పేర్కొన్నారు. చెన్నైలో పెరిగిన తాను, సుబ్రహ్మణ్య భారతి జీవితం నుంచి మూడు ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. "1) మాతృభూమి పట్ల నిర్భయమైన నిబద్ధత, 2) మాతృభాషపై ప్రేమ, 3) బహుభాషా నైపుణ్యాలు, ఇతర భాషల పట్ల గౌరవం.. ఈ మూడు విషయాలు ఆయన నుంచి నేర్చుకోవాలి. ఆయన నిజంగా భారతరత్నకు అర్హుడు" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు, హరీశ్ శంకర్ డైరెక్షన్ లో పవన్ కల్యాణ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మిగతా.. 2లో

# మహిళలూ వంటింటి ఆయుధాలతో సిద్ధంకండి

- ఓటర్ల జాబితా సమీక్ష సమయంలో తమ పేర్లు తొలగిస్తే వంటగది పనిముట్లతో సిద్ధంగా ఉండాలి
- ఓటర్ల జాబితా లక్ష్యంగా ఎస్ఐఆర్ సమీక్ష, రానున్న ఎన్నికల నేపథ్యంలో మమతా వ్యాఖ్యలు



కోల్‌కతా: ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) పై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా సమీక్ష సమయంలో తమ పేర్లు తొలగిస్తే వంటగది మిగతా.. 2లో




## చంద్రబాబు పాలనపై మోదీ ప్రశంసలు..

- ఏపీ, తెలంగాణ, అండమాన్ బీజేపీ ఎంపీలతో మోదీ భేటీ
- పెట్టుబడులు కూడా ఏపీ వైపు వెళుతుండటం హర్షణీయమని వెల్లడి
- తెలంగాణలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర పోషించట్లేదని అసంతృప్తి
- తెలుగు ఎంపీలు జాతీయ అంశాలపై చురుగ్గా ఉండాలని దిశానిర్దేశం

# రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగాం



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో సమావేశమయ్యారు. పార్టీ ఎంపీలతో కలిసి ఆయన అధిష్ఠానంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను, ప్రభుత్వ పాలన తీరును రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు వివరించారు. ముఖ్యంగా, ఇటీవల హైదరాబాద్ వేదికగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఘన విజయం సాధించిన విషయాన్ని సోనియా గాంధీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలివచ్చాయని ఆయన తెలిపారు. కేవలం రెండు రోజుల్లోనే వివిధ రంగాల్లో కలిపి రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని రేవంత్ రెడ్డి అధిష్ఠానానికి వివరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర అభివృద్ధికి ఈ పెట్టుబడులు ఎలా దోహదపడతాయో ఆయన వివరించినట్లు తెలుస్తోంది.

# మహిళలూ వంటింటి ఆయుధాలతో సిద్ధంకండి

కోల్‌కతా: ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) పై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా సమీక్ష సమయంలో తమ పేర్లు తొలగిస్తే వంటగది పనిముట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర మహిళలను కోరారు. ఓటర్ల జాబితా లక్ష్యంగా ఎస్ఐఆర్ సమీక్ష, రానున్న ఎన్నికల నేపథ్యంలో మమతా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మొదటినుంచీ ఎస్ఐఆర్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మమత తాజా వ్యాఖ్యలు ఇక బీజేపీపై ప్రత్యక్ష పోరుకు సిద్ధమైపోయినట్టు కనిపిస్తోంది. కృష్ణానగర్‌లో జరిగిన ఒక ర్యాలీలో బీజేపీని టార్గెట్ చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై నిప్పులు చెరిగారు. ఎస్ఐఆర్ పేరుతో తల్లులు, సోదరీమణుల హక్కులను లాక్కుంటున్నారని ఆమె మండి పడ్డారు. ఎన్నికల వేళ ఢిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మహిళల్ని బెదిరిస్తున్నారని విమర్శించారు. “తల్లులారా, సోదరీ మణులారా, మీ పేర్లు తొలగిస్తే, మీ దగ్గర పనిముట్లు ఉన్నాయి కదా? మీరు వంట చేయడానికి ఉపయోగించే పనిముట్లు. మీకు బలం ఉంది కదా? మీ పేర్లు తొలగిస్తే మీరు ఊరుకోరు కదా? మహిళలు ముందుండి పోరాడతారు” అన్నారు.

మహిళలా? బీజేపీ? తేల్చుకుందాం

అంతేకాదు మహిళలు బలవంతులా లేక బీజేపీ బలవంతమైనదా? తేల్చి చెప్పాలనుకుంటున్నానని వ్యాఖ్యానించారు. తాను లౌకికవాదినని, ఏ మతతత్వాన్ని నమ్మనని చెప్పుకొచ్చారు. కానీ బీజేపీ ఎన్నికలు వచ్చినప్పుడల్లా, డబ్బుతో ప్రజలను విభజించేందుకు ఇతర రాష్ట్రాల నుండి ప్రజలను తీసుకువస్తుందని ఆరోపించారు. ఆదివారం కోల్‌కతాలో నిర్వహించిన సామూహిక భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని బెనర్జీ ప్రస్తావించారు. అవసరమైనప్పుడల్లా మనమందరం ఇంట్లోనే గీత పఠిస్తాం. దానికి బహిరంగ ప్రదర్శన ఎందుకు అని ప్రశ్నించారు. దేవుడనేవాడు మన హృదయాల్లో ఉంటాడు. అల్లాను ప్రార్థించేవారు హృదయాల్లోనే ప్రార్థిస్తారు. రంజాన్ సమయంలో, దుర్గా పూజ సమయంలో, ఇక్కడంతా కలిసి ప్రార్థనలు నిర్వహించుకుంటాం అని గుర్తు చేశారు. అలాగ ధర్మం అంటే పవిత్రత, మానవత్వం, శాంతి, హింస, వివక్ష, విభజన కాదు ఇదే కదా గీతారం, శ్రీకృష్ణుడు చెప్పింది ఇదే గదా అని ఆమె బీజేపీనుద్దేశించి ప్రశ్నించారు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్ మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి గొప్ప వ్యక్తులెవరూ ప్రజలను విభజించే రాజకీయాలు చేయలేదని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి, దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన బెంగాల్ ప్రజలు తాము భారతదేశ పౌరులమని నిరూపించుకోవాలా అని ముఖ్యమంత్రి అన్నారు. బీజేపీ మిమ్మల్ని ఏదీ తిననివ్వదు. చేపలు, మాంసం తినాలా వద్దా అనేది ప్రజలే నిర్ణయించుకోవాలి. ఎవరు శాకాహారం, ఎవరు మాంసాహారం తినాలనేది వ్యక్తిగత ఎంపిక, అంతేగాని బీజేపీది కాదని స్పష్టం చేశారు. తన ప్రభుత్వం బెంగాల్ నుండి ఎవరినీ వెళ్లగొట్టదని అనుమతించదన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని బీఎస్ఎఫ్ పోస్టుల దగ్గరకు ఎవరూ వెళ్లవద్దు ఇదొక్కటే తన విన్నపం అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గాయపడిన పులి చాలా డేంజర్

గాయపడిన పులి ఆరోగ్యంగా ఉన్న పులి కంటే ఎక్కువ భయంకరంగా ఉంటుందని బెనర్జీ హెచ్చరించారు “మీరు మాపై దాడి చేస్తే, ఎలా ప్రతీకారం తీర్చుకోవాలో మాకు తెలుసు. అన్యాయాన్ని ఎలా ఆపాలో మాకు తెలుసు,” అని ఆమె అన్నారు. బీజేపీ తన ఐటీ సెల్ తయారుచేసిన జాబితాల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తోందని ఆరోపించారు. బిహార్ చేయలేక పోవచ్చు, కానీ బెంగాల్ చేసి చూపిస్తుంది, మీరు ఏమి చేసినా సరే గుర్తుంచుకోండి అంటూ బీజేపీకి సవాల్ విసిరారు.

### మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి
## సంబంధం లేదు: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. దిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు. ‘మెస్సీ గోట్ ఇండియా టూర్’లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు కూడా రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆయన ‘భారతరత్న’కు నిజంగా అర్హుడు

మొదటి పేజి తరువాయి

‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమా అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం నుంచి ‘దేఖ్లేంగే సాలా’ అనే ఫస్ట్ సింగిల్‌కు సంబంధించిన ప్రోమో ఇప్పటికే అంచనాలను పెంచేసింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యం అందించగా, దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. పూర్తి పాటను డిసెంబర్ 13న విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా రాజకీయాలతో బిజీగా ఉన్నప్పటికీ, పవన్ కల్యాణ్ ఈ సినిమా షూటింగ్ కోసం సమయం కేటాయించడం పట్ల గతంలో చిత్రబృందం ప్రశంసలు కురిపించింది.

### అమిత్ షా నిన్న ఆందోళనగా కనిపించారు,
## చేతులు కూడా వణికాయి

మొదటి పేజి తరువాయి

ప్రసంగం సమయంలో అమిత్ షా చేతులు కూడా వణుకుతూ కనిపించాయని, ఏ ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం చెప్పలేదని విమర్శించారు. తాను మాట్లాడిన వాటికి వేటికీ ఆధారం చూపించలేదని అన్నారు. మీడియా ముందు తాను చేసిన వ్యాఖ్యలన్నింటినీ పార్లమెంటులో చర్చిద్దామని ఆయనకు సవాల్ విసిరినప్పటికీ ఆయన నుంచి సమాధానం రాలేదని అన్నారు.

రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి విమర్శలు

పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నప్పుడల్లా రాహుల్ గాంధీ బయటకు వెళ్లిపోతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. రాహుల్ గాంధీ హిట్ అండ్ రన్ ఫార్ములాను అనుసరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే ఇదేనేమో అని చురక అంటించారు. భవిష్యత్తులో ఆయన తన అలవాటును మానుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ బీజేపీ ఎంపీలు మరింత యాక్టివ్‌గా ఉండాలి

మొదటి పేజి తరువాయి

గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే అవకాశం మిస్సయింది. అది నాకు చాలా ఆవేదన కలిగించిందంటూ ఎంపీలతో మోదీ అన్నారు. తెలంగాణలో పార్టీ ఎందుకు వెనుకబడింది. 8 మంది ఎంపీలు ఉన్న ప్రధాన ప్రతిపక్షంగా ఎందుకు ఎదగలేకపోతున్నారు? అంటూ ప్రధాని మోదీ ప్రశ్నలు గుప్పించారు. ప్రజల్లో పార్టీకి ఆదరణ ఉన్నా నాయకులు పనిచేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ.. గ్రూపు తగాదాలు వీడి ఐకమత్యంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో పార్టీ బలపడేలా దూకుడుగా పని చేయాలని సూచించారు. ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండండి. నిత్యం ప్రజలతో నిరంతర సంబంధాలు ఉండాలంటూ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో ఎంపీలకు ప్రధాని మోదీ హితబోధ చేశారు. కాగా, ఎన్డీఏ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ విందు ఏర్పాటు చేశారు. ప్రధాని అధికారిక నివాసంలో విందు కార్యక్రమం జరగనుంది. విందు ఏర్పాట్లను కేంద్ర మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. ఎంపీలను సమన్వయం చేసే బాధ్యతలు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకి అప్పగించారు. విందు కార్యక్రమంలో 54 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక కేంద్రమంత్రి కూర్చునే ఏర్పాట్లు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం అనంతరం విందు కార్యక్రమం ఏర్పాటు చేసిన ప్రధాని.. ఎన్డీఏ భాగస్వామి పక్షాల మధ్య మరింత సమన్వయం, ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాలపై మోదీ మాట్లాడనున్నారు.

## అప్పుడు ఎర్రటి ఎండ... ఇప్పుడు ఏసీ!
### టీడీపీ నేతలతో చంద్రబాబు ‘కాఫీ కబుర్లు’

అమరావతి: తెలుగుదేశం పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ‘కాఫీ కబుర్లు’ పేరిట నిర్వహించిన వినూత్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ముఖాముఖిగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. వారితో కలిసి కాఫీ ఆస్వాదించారు. పార్టీలో ఇటీవల నిర్వహించిన శిక్షణా కార్యక్రమాల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పాత రోజులను గుర్తు చేసుకున్నారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ హయాంలో తాము పడిన కష్టాలను నేతలతో పంచుకున్నారు. “నాడు చెట్ల కింద, ఎర్రటి ఎండలోనూ శిక్షణా కార్యక్రమాలు చేపట్టేవాళ్లం. ఎన్నో ఇబ్బందులున్నా పార్టీ సిద్ధాంతాల కోసం కష్టపడ్డాం. కానీ నేడు పరిస్థితులు మారాయి. ఇప్పుడు చల్లటి ఏసీ గదుల్లో శిక్షణ ఇస్తున్నాం. మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా నాయకులు కూడా తమ నాయకత్వ లక్షణాలను మెరుగుపరుచుకోవాలి. పార్టీ సిద్ధాంతాలను, భావజాలాన్ని ప్రతి కార్యకర్త తెలుసుకోవడం అత్యవసరం” అని ఆయన సూచించారు. నాయకత్వం ప్రాముఖ్యతను వివరిస్తూ, “ఎక్కడ సమర్థవంతమైన నాయకత్వం ఉంటుందో అక్కడ పార్టీకి ఎక్కువ ఓట్లు వస్తాయి. బలహీనమైన నియోజకవర్గానికి మంచి నేతను ఇస్తే, ఆ నియోజకవర్గాన్ని సైతం బలపరుస్తారు. అదే బలమైన నియోజకవర్గాన్ని బలహీన నేత చేతిలో పెడితే పార్టీని నిర్వీర్యం చేస్తారు. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి” అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. “అన్నదాత సుఖీభవ, దీపం-2.0, స్త్రీశక్తి, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేస్తున్నాం. వీటి ద్వారా మహిళల ఓటు బ్యాంకు మెజారిటీ మనకే వచ్చేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలదే” అని అన్నారు. గత ఐదేళ్ల పాలనపై విమర్శలు చేస్తూ, “2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో విధ్వంసం జరిగి వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఇప్పుడు వాటన్నింటినీ సరిచేసి గాడిన పెడుతున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత పట్టుదలతో పనిచేశారో, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు అంతకుమించిన స్థాయిలో పనిచేయాలి. ఏడాదికి రూ.33 వేల కోట్లు కేవలం పింఛన్లకే ఇస్తున్నాం. కొందరు డబ్బుతోనే ఎన్నికలను గెలవగలమని భావిస్తారు, కానీ అది భ్రమ మాత్రమే. మనం చేసే మంచి పనులను ప్రజలకు నిత్యం వివరిస్తేనే నిజమైన విజయం సాధ్యమవుతుంది. పని చేయడం ఒక ఎత్తు అయితే, చేసిన పనిని ప్రజల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తు” అని చంద్రబాబు ఉద్బోధించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో బలాబలాలు చూసుకుని, పార్టీని పటిష్టం చేయాలని నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## భారత్‌లో సేవలకు సిద్ధం.. ఎలాన్ మస్క్ కీలక ట్వీట్

ఢిల్లీ: ప్రముఖ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్ ఎట్టకేలకు భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. ఎలాన్ మస్క్ చేసిన ఒక్క ట్వీట్ ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. త్వరలోనే దేశంలో తమ సేవలను ప్రారంభించేందుకు కంపెనీ సిద్ధంగా ఉందనే సంకేతాలను ఇది పంపింది. ప్రభుత్వంతో స్టార్‌లింక్ బృందం చర్చిస్తున్న తరుణంలో మస్క్ స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో స్టార్‌లింక్ వైస్ ప్రెసిడెంట్ లారెన్ డ్రేయర్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు శాటిలైట్ ఆధారిత కనెక్టివిటీని విస్తరించడమే లక్ష్యంగా ఈ చర్చలు జరిగాయని సింధియా తెలిపారు. సంప్రదాయ నెట్‌వర్క్‌లు అందుబాటులో లేని చోట్ల ఈ టెక్నాలజీ కీలకం కానుందని ఆయన అన్నారు. దీనికి డ్రేయర్ స్పందిస్తూ దేశవ్యాప్తంగా హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే, స్టార్‌లింక్ సేవలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకే పరిమితమవుతాయని ఎలాన్ మస్క్ స్పష్టం చేశారు. సరైన కనెక్టివిటీ లేని లేదా ఖరీదైన, నమ్మకంలేని బ్రాడ్‌బ్యాండ్ ఉన్న ప్రాంతాల కోసమే దీన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. భౌతిక పరిమితుల కారణంగా జనసాంద్రత అధికంగా ఉండే నగరాల్లో స్టార్‌లింక్ సేవలు అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతానికి స్టార్‌లింక్ సేవలకు సంబంధించి ప్రభుత్వ తుది అనుమతులు రావాల్సి ఉంది. కార్యకలాపాలు ప్రారంభించేందుకు కంపెనీ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ కోసం వేచి చూస్తున్నామని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.

### తాడేపల్లి వద్ద రూ.532 కోట్లతో
## ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రహదారుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, విద్యా రంగం, జైళ్ల సంస్కరణలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జాతీయ రహదారి 16పై భారీ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తాడేపల్లి వరకు 3.8 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎల్1 బిడ్‌ను ఆమోదించారు. ఈ ప్రాజెక్టులో ఇంటర్‌ఛేంజ్‌లు, వంతెనలు, అండర్‌పాస్‌లు కూడా భాగంగా ఉంటాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువ రూ.532 కోట్ల 57 లక్షలుగా నిర్ణయించారు. దీనితో పాటు, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలార్ నదిపై ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల కోసం సవరించిన పరిపాలనా ఆమోదాన్ని కేబినెట్ మంజూరు చేసింది. గతంలో రూ.10.24 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.15.96 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగులు, విద్యారంగానికి ప్రాధాన్యం

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట కల్పిస్తూ రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 3.64 శాతం చొప్పున డీఏ చెల్లించనున్నారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని 417 పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో 227 తెలుగు, 91 హిందీ భాషా పండితుల పోస్టులతో పాటు 99 వ్యాయామ ఉపాధ్యాయుల (పీడీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌కు ఉన్నతీకరించారు.

చట్టాలు, బోర్డులపై కీలక నిర్ణయాలు

బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేస్తూ జైళ్ల సంస్కరణల దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రూపొందించిన ‘మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023’కు అనుగుణంగా ‘ది ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్, 2025’ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గంజాయి వంటి నేరాలకు పాల్పడిన ఖైదీలకు సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో సంస్కరణ తీసుకురావడంపై మరింత అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతోపాటు, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు పునర్వ్యవస్థీకరణకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ బోర్డుకు చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులను నియమించనున్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించే క్రమంలో వైజాగ్%-%చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు కేబినెట్ పూర్తి ఆమోదం తెలిపింది. ప్రముఖ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్‌కు 100 ఎకరాల భూమి కేటాయించాలని నిర్ణయించింది. అమరావతిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐదు కంపెనీల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. రిలయన్స్ కన్స్యూమర్ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా తీర్మానించింది. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గవర్నర్ బంగ్లా, దర్బార్ హాల్, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి సంబంధించిన బిడ్డింగ్ ప్రక్రియకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని రాజధాని నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## ఆల్ టైమ్ రికార్డ్... మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో దూసుకుపోతున్న ధాన్యం కొనుగోళ్లు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కేవలం ఒక్కరోజే, అంటే డిసెంబర్ 10న, ఏకంగా 1,46,607 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి పౌరసరఫరాల శాఖ ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. డిసెంబర్ 11 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 3,24,296 మంది రైతుల నుంచి మొత్తం 20,64,673 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు గాను రైతులకు ఇప్పటివరకు రూ.4,609.89 కోట్లను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైన కేవలం 15 రోజుల్లోనే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కు 1,71,651 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్డ్ రైస్ బియ్యాన్ని పంపడం ఒక చారిత్రక రికార్డుగా పౌరసరఫరాల శాఖ పేర్కొంది. ఇటీవల కురిసిన వర్షాలు, దిత్వా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని 106 రైస్ మిల్లులకు ఇతర జిల్లాల నుంచి ధాన్యం తరలించేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేసింది. కొనుగోలు, రవాణా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 32,000 లారీలు, ట్రాక్టర్లు, ప్రత్యేక రైళ్లను వినియోగిస్తున్నారు. రైతులకు అండగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పారదర్శక విధానాలతో కొనుగోళ్లు జరుపుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మిల్లర్లపై కఠిన నిఘా ఉంచి, రోజువారీ సమీక్షలతో ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని, రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## చంద్రబాబు పాలనపై మోదీ ప్రశంసలు.. జగన్ విమర్శలను తిప్పికొట్టాలని ఆదేశం!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం శుభపరిణామమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై తనకు మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, పెట్టుబడులు కూడా ఏపీ వైపు వెళుతుండటం హర్షణీయమని, అది అభివృద్ధికి సూచిక అని ప్రశంసించారు. ఈరోజు ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాలకు చెందిన బీజేపీ ఎంపీలతో ప్రధాని అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు అరగంట పాటు ఆయన ఎంపీలతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఏపీ బీజేపీ ఎంపీలకు మోదీ కీలక సూచన చేశారు. వైసీపీ అధినేత జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలను బీజేపీ కూడా అంతే దీటుగా తిప్పికొట్టాలని ప్రధాని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో సానుకూల వాతావరణం ఉందని, దానిని కాపాడుకోవాలని సూచించారు. అదే సమయంలో, తెలంగాణ బీజేపీ ఎంపీల పనితీరుపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్ష పాత్రను కూడా సమర్థంగా పోషించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. “మంచి టీమ్‌ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి సమస్యేంటి? పార్టీ గ్రాఫ్ పెంచుకోవడానికి మంచి అవకాశం ఉన్నా ఎందుకు విఫలమవుతున్నారు?” అని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాల ఎంపీలు జాతీయ అంశాలపై చురుగ్గా స్పందించాలని, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని మోదీ సూచించారు.

## విజయ్ కు షాక్... డీఎంకేలో చేరిన అత్యంత సన్నిహితుడు

తమిళనాడు: తమిళ సూపర్‌స్టార్ విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఏర్పాటైన కొద్ది కాలానికే అంతర్గత సమస్యలు బయటపడుతున్నాయి. తాజాగా విజయ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సెల్వకుమార్ పార్టీని వీడి, అధికార డీఎంకేలో చేరడం తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో సెల్వకుమార్ డీఎంకే కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీవీకేలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. టీవీకేలో సెల్వకుమార్‌కు అధికారికంగా ఎలాంటి పదవి లేనప్పటికీ, ఆయన విజయ్‌కు వ్యక్తిగతంగా చాలా సన్నిహితుడు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీని వీడటం ప్రాధాన్యత సంతరించుకుంది. సెల్వకుమార్ చేరికను డీఎంకే నేతలు స్వాగతించారు. రానున్న రోజుల్లో టీవీకే నుంచి మరిన్ని చేరికలు ఉంటాయని వారు సూచనప్రాయంగా తెలిపారు. ఈ కీలక పరిణామంపై టీవీకే అధిష్ఠానం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో సొంత పార్టీలోని సన్నిహితుడే ప్రత్యర్థి శిబిరంలో చేరడం విజయ్ కి గట్టి దెబ్బేనని చెప్పాలి.

## మిమ్మల్ని చూస్తే రతన్ టాటా గుర్తొస్తారు

హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025’లో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, మెగాస్టార్ చిరంజీవి మధ్య జరిగిన స్నేహపూర్వక సంభాషణ, ఆ తర్వాత సోషల్ మీడియాలో వారిద్దరూ ఒకరిపై ఒకరు చేసుకున్న ప్రశంసలు వైరల్‌గా మారాయి. ఈ సమ్మిట్ అనంతరం ఆనంద్ మహీంద్రా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చిరంజీవితో దిగిన ఫొటోను షేర్ చేశారు. “సీఎం రేవంత్ రెడ్డితో విజన్ 2047 గురించి చర్చించాక, మెగాస్టార్ చిరంజీవిని కలవడం ఊహించని సర్‌ప్రైజ్. ఆయన ఒక లెజెండ్. కానీ, ఆయనలోని వినయం, ప్రతీ విషయంపై చూపిన నిజమైన ఆసక్తి నన్ను మరింతగా ఆకట్టుకున్నాయి. నేర్చుకోవాలనే తపన, వినయంతో వినడమే ఏ రంగంలోనైనా శాశ్వత విజయానికి పునాది” అని మహీంద్రా తన పోస్టులో పేర్కొన్నారు. ఆనంద్ మహీంద్రా ప్రశంసలపై చిరంజీవి కూడా స్పందించారు. “డియర్ ఆనంద్ మహీంద్రా గారూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మీ స్వభావం ఎందరికో ఆదర్శనీయం. మీరు చాలాసార్లు నాకు రతన్ టాటాను గుర్తుకు తెస్తారు. ఆయన తన విలువలతో స్ఫూర్తిగా నిలిస్తే, మీరు సేవా కార్యక్రమాలలో చూపుతున్న నిబద్ధత ఎంతో మందికి ఆదర్శం. మీతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది” అని చిరంజీవి బదులిచ్చారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యంగా సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఇక సినిమాల విషయానికొస్తే, చిరంజీవి ప్రస్తుతం ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది.

## ఆ భారాన్ని కూటమి ప్రభుత్వమే భరించాలి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. “చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి దొంగ పనులు” అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం చేస్తోందంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సుమారు రూ.15,651 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రజాభిప్రాయ సేకరణకు ప్రకటన కూడా జారీ చేసిందని షర్మిల గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా, ప్రజలపై భారం పడదని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని పదేపదే చెప్పడం పాత చింతకాయ పచ్చడిలా ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15 వేల కోట్లను ప్రజల నుంచి ట్రూ-అప్ బిల్లుల రూపంలో వసూలు చేసి వారి జేబులకు చిల్లులు పెట్టారని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి ‘టైమ్ ఆఫ్ ది డే’ పేరుతో ఇంకో రూ.15 వేల కోట్లను దోచుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని షర్మిల ఆరోపించారు. నమ్మి ఓటేసినందుకు ఏడాదికోసారి ప్రజలకు ఇలా ‘హైటెన్షన్ షాక్’ ఇస్తున్నారని, ఆర్థిక లోటు పేరుతో ప్రజల నడ్డి విరవడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రికి కొన్ని డిమాండ్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. “మీకు నిజంగా ఛార్జీలు పెంచకూడదనే చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మీద నిలబడాలనుకుంటే, ఏపీఈఆర్‌సీ ప్రతిపాదనలపై తక్షణం స్పందించండి. ప్రతిపాదిత రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని అధికారికంగా ప్రకటించండి. అలాగే, ఇప్పటివరకు ప్రజలపై మోపిన రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను కూడా వెంటనే రద్దు చేయాలి” అని షర్మిల డిమాండ్ చేశారు.

### అరుణాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..
## 17 మంది కార్మికులు దుర్మరణం

అరుణాచల్: అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇండో-చైనా సరిహద్దుకు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 21 మంది కార్మికులతో వెళుతున్న ఓ ట్రక్కు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. అంజావ్ జిల్లాలోని హయులియాంగ్-చగ్లాగం రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఈ ప్రమాదం వాస్తవానికి సోమవారం జరగ్గా, మూడు రోజుల తర్వాత ఈరోజు వెలుగులోకి వచ్చింది. ట్రక్కుతో పాటు లోయలో పడిపోయిన వారిలో ప్రాణాలతో బయటపడిన ఓ కార్మికుడు, తీవ్ర గాయాలతో సమీపంలోని పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ అధికారులకు సమాచారం అందించడంతో ఈ విషాద ఘటన గురించి బాహ్య ప్రపంచానికి తెలిసింది. ఈ విషయాన్ని అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కోజిన్ ధృవీకరించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 10,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉందని ఆయన తెలిపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు సహాయక చర్యలపై దృష్టి సారించారు.

## జగన్ విమర్శలపై భాజపా దీటుగా కౌంటర్ ఇవ్వాలి

దిల్లీ: ఏపీలో సీఎం చంద్రబాబు తో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. దిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల భాజపా ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు ఆయన మాట్లాడారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళుతున్నాయని.. ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చినట్లు సమాచారం. వైకాపా అధ్యక్షుడు జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు భాజపా కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు. “తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటి? రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు” అని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

### ఇస్రో దూకుడు... డిసెంబర్ 15న అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల్లో మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. అమెరికాకు చెందిన 6.5 టన్నుల బరువున్న ‘బ్లూబర్డ్-6’ కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని డిసెంబర్ 15న నింగిలోకి పంపనుంది. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్న అత్యంత బరువైన ఉపగ్రహాలలో ఇది ఒకటి. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం కోసం అక్టోబర్ 19నే ఈ ఉపగ్రహం అమెరికా నుంచి భారత్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఇది కక్ష్యలో అతిపెద్ద కమర్షియల్ ఫేజ్డ్ అర్రేను కలిగి ఉంటుందని, గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా 10 రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేస్తుందని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. అంతరిక్ష రంగంలో భారత్, అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద సహకారం. గత జూలైలో ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1.5 బిలియన్ డాలర్ల నిసార్ ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. LVM3 రాకెట్ 8,000 కిలోల బరువును లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి, 4,000 కిలోల బరువును జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి మోసుకెళ్లగలదు. ఇటీవలే నవంబర్ 2న 4.4 టన్నుల బరువున్న సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారానే విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

## చిన్నస్వామి స్టేడియంలో మళ్లీ మ్యాచ్‌లు?..

బెంగళూరు: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ విషయంపై తాము సానుకూల దృక్పథంతో ఉన్నామని స్పష్టం చేశారు. ఇవాళ బెళగావిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) నూతన అధ్యక్షుడు, మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, తనను కలిసి ఒక వినతిపత్రం సమర్పించిందని శివకుమార్ తెలిపారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్ సమావేశంలో చర్చిస్తామని ఆయన వెల్లడించారు. “చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ప్రమాదం జరగాల్సింది కాదు. కానీ, జరిగింది. అక్కడ చాలా లోపాలు ఉన్నాయి. వాటన్నింటినీ సరిదిద్ది, ప్రేక్షకుల నిర్వహణకు ప్రత్యేక మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలి” అని ఆయన అన్నారు. ఈ ఏడాది జూన్ 4న స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన ఘటన తర్వాత అక్కడ ఎలాంటి మ్యాచ్‌లు జరగలేదు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ మాట్లాడుతూ, “వ్యక్తిగతంగా నేను ఈ విషయంలో సానుకూలంగా ఉన్నాను. మన రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం వాటిల్లనివ్వకూడదు. అందుకే కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం” అని పేర్కొన్నారు. క్రికెట్ మ్యాచ్‌లను ఆపే ఉద్దేశం తమకు లేదని, అయితే ప్రేక్షకుల భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. జస్టిస్ మైఖేల్ డి’కున్హా కమిటీ సిఫార్సులను దశలవారీగా అమలు చేస్తామని, దీనికి వెంకటేశ్ ప్రసాద్ కూడా అంగీకరించారని తెలిపారు. ఐపీఎల్ అయినా, మరే ఇతర మ్యాచ్ అయినా బెంగళూరు నుంచి తరలించేందుకు ఒప్పుకోమని, అవసరమైతే కొత్త స్టేడియాల నిర్మాణంపై కూడా చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ వారి సెమీ క్రిస్మస్ వేడుకలు ..





నేటి వాస్తవాలు డిసెంబర్ 10 శేరి లింగంపల్లి నేటి శుభోదయ: శేరిలింగంపల్లి నియోజక వర్గం హాఫీజ్ పెట్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో గల ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ వారి సెమీ



క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాస్టర్ శ్యాం బాబు క్రిస్మస్ పండుగ విశిష్టత గురించి తన వాక్యం ద్వారా సంఘ సభ్యుల కి సవివరంగా వివరించారు, యేసుదాసులు బృందగానం తో యేసు ను స్తుతించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, పాస్టర్ సంగమేష్ లు పాల్గొన్నరు. అనంతరం కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమాల్లో సంఘం సభ్యులు బస్తివాసులు పాల్గొన్నారు.

## కారంపూడితో కారంపూడి విఆర్ఏ అంతరగడ్డ. ప్రసాద్ మృతి



నేటి శుభోదయ 11 డిసెంబర్ పల్నాడు జిల్లా కారంపూడి: అనారోగ్యంతో బాధపడుతూ కారంపూడి విఆర్ఏ అంతరగడ్డ. ప్రసాద్ గురువారం మృతి చెందారు. అయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈరోజు ఉదయం అయన మరణించినట్లు తెలియజేశారు. అంతరగడ్డ. ప్రసాద్ మృతిపట్ల తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మండలంలోని పలు గ్రామాల విఆర్ఓ లు, విఆర్ఏ లు, కారంపూడి గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు అయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసారు.

## శ్రీ సిమెంట్ యాజమాన్యం సారధ్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ



నేటి శుభోదయ 11 డిసెంబర్ పల్నాడు జిల్లా కారంపూడి : కారంపూడి మండలం, కాచవరం గ్రామంలో శ్రీ సిమెంట్ యాజమాన్యం సారధ్యంలో (సిఎస్ఆర్) అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు వితరణ చేశారు. గురువారం కాచవరం గ్రామంలో సుమారు రూ 3లక్షలతో ఏర్పాటు చేసిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్ ను శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నూతన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడల్లో భాగంగా క్రీడ పరికరాల కిట్లును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాట్లాడుతూ సి ఎస్ ఆర్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా అభివృద్ధి చేసే కార్యక్రమాలను కూడా త్వరలో స్వీకారం చుట్టా ఉన్న మని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిమెంట్ యాజమాన్యం పెద్దలు కె. శ్రీనివాసరావు,ఎస్. లక్ష్మీనారాయణ, రహీం, ఎస్. గురవయ్య, బి. సురేష్,జె. అనిమి రెడ్డి, గ్రామ పెద్దలు, పాలుగోన్నారు.

## సిపిఎం పార్టీ సర్పంచ్ అభ్యర్థి సపవట్ లలిత ప్రచారం

### గెలుపు దిశగా సిపిఎం పార్టీ.



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి డిసెంబర్ 11: మంచాల మండలం సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఆరుట్ల గ్రామంలో సిపిఎం పార్టీ సర్పంచ్ అభ్యర్థి సపవట్ లలిత పాండు నాయక్ గ్రామంలోని అన్ని వార్డులు తిరుగుతూ గడపగడపకు వెళ్లి బ్యాట్ గుర్తుకు ఓటు వేసి సర్పంచిగా గెలిపించాలని ప్రజలను కోరారు ఈ సందర్భంగా సర్పం చ్ అభ్యర్థి సపవట్ లలిత పాండు నాయక్ మాట్లాడుతూ సిపిఎం పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండే పార్టీ అని అన్నారు ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాడి సమ స్యలు పరిష్కరించే ఏకైక పార్టీ సిపిఎం పార్టీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఆరుట్ల గ్రామ ప్రజలు నన్ను ఆదరించి సర్పంచిగా గెలిపిస్తే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైన అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాను గ్రామం అభివృద్ధి కోసం పాటుపడతా ను అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పుల్లగళ్ళ గోపాల్ జోగు శేఖర్ అశోక్ ఆనపాటి గణేష్ మహిళల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## వెహికిల్స్ దార్లకు సూచనలు!...



### ఎస్సై సంతోష్ కుమార్!...

వి.ఆర్.పురం,డిసెంబర్11(నేటి శుభోదయ ప్రతినిధి): మీ వెహికల్స్ పై ఉన్న చలాన్లను,ఫైన్స్ ను ఆన్లైన్లో చెల్లించాలని, వరరామచంద్రాపురం ఎస్సై సంతోష్ కుమార్,చలనాలు ఉన్న వెహికిల్స్ దార్లకు,సూచించారు.గురువారం ప్రెస్ నోట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీసేవ కేంద్రాలు ద్వారా చెల్లింపులు చేసుకోవాలని కోరారు.అలా చేయని పక్షంలో మాదృష్టికి వస్తే చట్టప్రకారంచర్యలు తీసుకుంటామని తెలిపారు. అవకాశం ఉన్నవాళ్లు వినియోగించుకోవాలని సూచించారు.

## ఎన్నికల రూల్స్ ఉల్లంఘన

### ఎఫ్ ఎస్ టి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు.




**(నేటి శుభోదయ):** యాచారం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎఫ్ ఎస్ టి టీమ్ ఫిర్యాదు మేరకు 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనపై కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదు ప్రకారం, 10.12.2025 తేదీ సాయంత్రం 5:30 గంటల సమయంలో మాల్ గ్రామంలో సుభానీ అతని వార్డు సభ్యులు సుమారు 100 నుండి 150 మంది ప్రజలను కూడగట్టుకొని, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లతో ఊరేగింపు ప్రొసెషన్ నిర్వహించారు. దీనిపై సుభానీ ఇతరులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగుతోంది.

# టీడీపీ,సీపీఐ పొత్తుతో కాంగ్రెస్ సర్పంచ్ విజయం కాయం

### తిరుమలాయపాలెంలో భారీ మేజార్టీపై దృష్టి సారించిన కూటమి ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి ధారావత్ సుజాత

తిరుమలాయపాలెం డిసెంబర్ 11 (నేటి శుభోదయ): ఇందిరమ్మ ప్రభుత్వం అధికారం చేతపట్టిన రెండేళ్ల కాలంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ..ప్రజా సమస్యలు తీర్చడమే లక్ష్యంగా ప్రజాపాలన



సాగుతుందని తిరుమలాయపాలెం కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ధారావత్ సుజాత - నరసింహారావు అన్నారు. స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా..తిరుమలాయపాలెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ,సీపీఐ పార్టీలు బలపర్చిన ధారావత్ సుజాత నరసింహారావు మాట్లాడుతూ.. గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రజాదరణ లభిస్తుందని,ప్రజాల అశీర్వదం తో తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న సంక్షేమాలు,స్థానిక



ఎమ్మెల్యే,రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృది వారికి శ్రీ రామ రక్ష అని తెలిపారు. 14న ఎగిరేది కాంగ్రెస్ జండానే అని,మంత్రి పొంగులేటి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని ధీమా వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వం ద్వారా తిరుమలాయపాలెం గ్రామంలో నూతన ఐటీఐ కళశాల మంజూరు. ఇండ్లు లేని హర్హులైన పేదవారికి 1కోటి 75 లక్షాలతో 35ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం. 30పడకల ఆసుపత్రి 50 పడకలకు పెంపు కోసం టివివి పథకం ద్వారా రూ.26 కోట్ల నిధులు మంజూరు.గత వరదల కారణంగా తిరుమలాయపాలెం నుంచి ములకలపల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి దెబ్బతినగా,మరమ్మత్తుల కోసం రూ.1కోటి 50 లక్షలతో పనుల ప్రారంభం,కేజీబీవీ భవనం మరమ్మత్తుల కోసం నిధులు కేటాయింపు.ఆగిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనుల ప్రారంభంకై నిధులు.ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో




బాలుర జూనియర్ కళాశాల భవనంలో మరుగుదొడ్లు నిర్మాణం. బీటీ రోడ్లు,అంతర్గత సీసీ రోడ్లు,ఉర్దూ అకాడమీ ఉర్దూఘర్ మరియు షాదీఖానా అభివృద్ధి,అంగన్వాడీ భవనం, పశువైద్యశాల భవనానికి మరమ్మతులు,త్రాగునీటి సరఫరా మెరుగుపరచడంకై నిధుల కేటాయింపు, గిరిజన భవనం నిర్మాణంతోపాటు 72 కుటుంబాలకు చెందిన 212 మందికి కొత్త రేషన్ కార్డులు అందించారు. నిత్యం ప్రజా క్షేమంకోరే ప్రజా ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంట్టుందని, కావున గ్రామానికి మరింత సేవ చేసే అవకాశం తమకు కలిపించాలని ఈ సందర్భంగా వారు కోరారు. మీ యొక్క అమూల్యమైన ఓటును" కత్తెర "గుర్తుపై వేసి గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ ఇంచార్జ్ రాధాకృష్ణ, వార్డు సభ్యులు,మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్,నాయకులు తాటికొండ కిరణ్ కుమార్, గోళ్ళ లింగయ్య, కొలిచలం వెంకటేశ్వర్లు,సీపీఐ నాయకులు చీమ రామకృష్ణ, శివ,గోపయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఈగల్ టీం తో తగ్గిన నేరాలు




నేటి శుభోదయం,-గోకవరం.: ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఈగల్ టీం పనితీరుతో నేరాలు గణనీయంగా తగ్గాయని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రమైన గోకవరం పోలీస్ స్టేషన్ ని ఎస్పీ నరసింహం కిశోర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది క్రైమ్ రేటు తగ్గిందన్నారు.



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల క్లిష్టమైన కేసులను సైతం షేధిస్తున్నామని తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం తో కేసులను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. సమాజంలోశాంతిభద్రతల పరిస్థితి పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలి అన్నారు. గోకవరం, కోరుకొండలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి ఎస్.ఐ పవన్ కుమార్ ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్ధరాత్రి సమయంలో డ్రోన్ కెమెరాల ద్వారా నేరాల నరికట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీకాంత్, సిఐ సత్యనారాయణమూర్తి, ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి కౌశల్ సైన్స్ పోటీల్లో గుమ్మళ్ళ దొడ్డి విద్యార్థిని ఎంపిక




నేటీ శుభోదయ -గోకవరం.: మండలంలోని గుమ్మళ్ళదొడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని టీ. గీతాశ్రీ కౌశల్ సైన్స్ ప్రతిభానివేషణ పోటీలలో బాలిక విభాగంలో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకుంది. ప్రతి సంవత్సరం విద్యార్థులలో నిగూఢమైయున్న విజ్ఞాన శాస్త్ర భావాలను సృజనాత్మక తను వెలికి తీసేందుకు నిర్వహించే ఈ పోటీలలో టీ. గీతాశ్రీ పాఠశాల తరఫున పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంత తెలిపారు. ఈనెల 27వ తేదీన రాష్ట్రస్థాయిలో తిరుపతిలో జరిగే పోటీలకు గీతాశ్రీ ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన గీతాశ్రీని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు అభినందించారు.

## చందానగర్ లో ఘనంగా దివ్యాంగులదినోత్సవం..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ ప్రతినిధి..: జి హెచ్ ఎం సి చందానగర్ సర్కిల్ 21 అధికారులు అంబేద్కర్ మున్సిపల్ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ హాజరై ఆమె మాట్లాడుతూ. అంగవైకల్యం అనేది శరీరానికి మాత్రమే నని అది మనసుకు కాదని అంగవైకల్యంతో బాధపడకుండా ఆత్మవిశ్వాసంతో బ్రతకాలని సూచించారు. దివ్యాంగులకు ఎల్లవేళలా తమ సహకారం ఉంటుందన్నారు. అనంతరం దుప్పట్లు, చంక కర్రలు, వీల్ చైర్స్, చేతి కర్రలు, హెరింగ్ మిషన్స్ తదితర పరికరాలు అందించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారిని విజయలక్ష్మి సి ఓ లు లక్ష్మి లక్ష్మీ గౌడ్ రుక్మిణి దివ్యాంగుల నాయకులు అధ్యక్షులు మేకల అశోక్ కుమార్ ముదిరాజ్. ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ జనరల్ సెక్రెటరీ ఫకీర్ సాబ్ సలహాదారులు వైవి రమణ, నాగులు, అంజలి దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి కేశవపురం గ్రామని అభివృద్ధి చేసి చూపిస్తా

### టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఈదుల మహేష్




తిరుమలయపాలెం డిసెంబర్ 11 (నేటి శుభోదయ): కేశవపురం గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా ఈదుల మహేష్ "ఉంగరం" గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. గ్రామంలోని ప్రజలందరూ ఒక్క అవకాశం ఇస్తే కేశవపురం గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానంటూ ప్రజలను కోరారు. పనిచేసేవారికి పట్టం కట్టాలని గ్రామం అభివృద్ధి పదంలో ముందు ఉండాలంటే బీఆర్ఎస్ కి ఓటేయాలని అన్నారు. మీ అమూల్యమైన ఓటుని "ఉంగరం" గుర్తుపై వేసి నన్ను గెలిపించాలని అని నన్ను గ్రామ ప్రజలందరూ దీవించి "ఉంగరం" గుర్తుపైన ఓట్లు వేయాలని భారీ మెజార్టీతో గెలిపిస్తారని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.

# తమ బ్రాండ్ అంబాసిడర్ మొహమ్మద్ సిరాజ్ తో హైదరాబాద్ లో మొట్టమొదటి సారిగా ఫ్యాన్ మీట్ - గ్రీట్ను నిర్వహించిన స్కెచర్స్

శేరి లింగంపల్లి నేటి శుభోదయ ప్రతినిధి: ది కంఫర్ట్ టెక్నాలజీ కంపెనీ, స్కెచర్స్, హైదరాబాద్ లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్లో భారతదేశపు ఫాస్ట్ బౌలింగ్ సంచలనం మొహమ్మద్ సిరాజ్ తో ప్రత్యేకమైన, అత్యంత ఉత్సాహపూరితమైన ఫ్యాన్ ఈవెంట్ను నిర్వహించింది. ఈ బ్రాండ్ మొట్టమొదటి సారిగా తమ బ్రాండ్ ప్రచార కర్త మొహమ్మద్ సిరాజ్ స్వస్థలంలో ఫ్యాన్ మీట్ - గ్రీట్ నిర్వహిస్తున్న సందర్భంగా, ఈ కార్యక్రమం అభిమానులకు తమ స్థానిక హీరోతో కనెక్ట్ అవ్వడానికి, అతనితో సంభాషించటానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందించింది. భారతదేశపు అత్యంత భయంకరమైన పేసర్లలో ఒకరిగా మరియు క్రికెట్ ఐకాన్ గా మారడానికి అతని ప్రయాణాన్ని వేడుక జరుపుకుంది. భారతదేశంలో ఎక్కువగా ఆరాధించబడుతున్న క్రికెట్ ఐకాన్ లో ఒకరిగా మారిన ఏస్ పేసర్ తో ముచ్చటించటానికి అభిమానులు భారీ సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమంలో హాజరైన వారు సిరాజ్ తో కనెక్ట్ అవ్వడానికి, సరదా సవాళ్లలో పాల్గొనడానికి ఈ సందర్భం కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన శక్తివంతమైన, చిరస్మరణీయ అనుభవంలో భాగం కావడానికి అవకాశం కల్పించింది. ఈ వాతావరణం అత్యంత ఉత్సాహపూరితంగా మారింది, అభిమానుల పట్ల సిరాజ్ చూపే గౌరవం మరియు ఉత్సాహాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమం గురించి స్కెచర్స్ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ రాహుల్ విరా మాట్లాడుతూ, "హైదరాబాద్ కు మొహమ్మద్ సిరాజ్ తో ప్రత్యేక అనుబంధం ఉంది, నేటి కార్యక్రమం ఆ బంధాన్ని వేడుక జరుపుకుంది. స్కెచర్స్ కుటుంబంలో భాగంగా, మా బ్రాండ్ అంబాసిడర్ గా హైదరాబాద్ కు చెందిన స్పైడర్ మొహమ్మద్ సిరాజ్ ఉండటం మాకు చాలా ఆనందంగా ఉంది. అతని శక్తి, నిబద్ధత




మరియు స్ఫూర్తిదాయకమైన ప్రయాణం స్కెచర్స్ దేనిని సూచిస్తుందో దానికి సరిగ్గా సరిపోతుంది. ఈ మీట్ - గ్రీట్ అభిమానులు అతనిని కలుసుకోవటానికి, ఆవిష్కరణలను సాటిలేని సౌకర్యంతో స్కెచర్ స్ కలిపే మా తాజా ప్రదర్శన-ఆధారిత కలెక్షన్ లను అన్వేషించడానికి ఒక గొప్ప అవకాశం" అని అన్నారు. స్కెచర్స్ కుటుంబంలో చేరడం తన సంతోషాన్ని మొహమ్మద్ పట్ల సిరాజ్ పంచుకుంటూ, "హైదరాబాద్ నా ఇల్లు ఇక్కడ అభిమానులను కలవడం ఎల్లప్పుడూ చాలా ప్రత్యేకమైనది. స్కెచర్స్ తో భాగస్వామ్యం చేసుకోవటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇది సౌకర్యం, పనితీరు, ప్రామాణికత ను ప్రతిబింబించే బ్రాండ్. ఈ రోజు కార్యక్రమం ఆత్మీయత మరియు ఉత్సాహంతో నిండి ఉంది. ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరు చూపుతున్న ప్రేమ. అందిస్తోన్న మద్దతుకు నేను కృతజ్ఞుడను. స్కెచర్స్ కుటుంబం, నా అభిమానులతో మరిన్ని చిరస్మరణీయ క్షణాలను పొందాలని నేను ఎదురు చూస్తున్నాను" అని అన్నారు. శరత్ సిటీ క్యాపిటల్ మాల్లో లోయర్ గ్రౌండ్ ఫ్లోర్లోని స్కెచర్స్ స్టోర్, ఇప్పుడు 5500 చదరపు అడుగుల ఏ ం గ్రేడ్ స్థలంలో ఉంది. గత సంవత్సరం పునరుద్ధరించబడి, తిరిగి ప్రారంభించబడింది. నిరంతరం పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్ తర్వాత ఈ అప్గ్రేడ్ వచ్చింది. విస్తృతమైన, మరింత లీనమయ్యే రిటైల్ అనుభవాన్ని అందించడానికి బ్రాండ్ దాని మునుపటి 1800 చదరపు అడుగుల ఫార్మాట్ నుండి విస్తరించడానికి ప్రేరేపించబడింది. నేడు, ఈ స్టోర్ స్కెచర్స్ సిగ్నేచర్ కంఫర్ట్ టెక్నాలజీతో కూడిన బ్రాండ్ యొక్క విస్తృతశ్రేణి జీవనశైలి, పనితీరు కలెక్షన్ లను ప్రదర్శిస్తుంది.

# క్రిస్మస్ శోభ: బాలానగర్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




**(నేటి శుభోదయ):** కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఉమెన్స్ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. క్రీస్తు జననం సందర్భంగా ప్రపంచమంతా ఆనందోత్సాహాలతో జరుపుకునే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమెన్స్ క్రిస్టియన్ సెల్ సభ్యురాలు సిస్టర్ మీనా, సునీత, సుకీర్తి ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ స్త్రీల ఉద్యమం వ్యవస్థాపకురాలు, వాక్యోపదేశకురాలు డా. థెరెసా పాల్ ముఖ్య అతిథిగా హాజరై, క్రిస్మస్ స్ఫూర్తిని, ఏసుక్రీస్తు ప్రేమ సందేశాన్ని వివరిస్తూ అమూల్యమైన సందేశాన్ని అందించారు.

**చిన్నారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ:**

సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ థీమ్‌తో చిన్నారులు ధరించిన ప్రత్యేక వేషధారణలు, ఆపై వారు క్రిస్మస్ ప్రత్యేక గీతాలకు చేసిన నృత్యాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా, యేసుక్రీస్తు జన్మదినానికి గుర్తుగా కేక్ కట్ చేసి ఉమెన్స్ క్రిస్టియన్ సెల్ సభ్యులు మరియు క్రిస్టియన్ సోదర సోదరీమణులకు ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో బాలానగర్ డివిజన్‌లోని క్రైస్తవ కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని, క్రిస్మస్ ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్లు విజయ్ బాబు, వైజి. కిషోర్, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

# ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11నేటి శుభోదయ: రబీ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.ఎడపల్లి మండలం జానకంపేటలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈ-పాస్ ద్వారా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు.స్టాక్ కొంత మిగిలి ఉన్నప్పుడే ఇండెంట్ సమర్పించి, ఎరువులను గోడౌన్ కు తెప్పించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.



కాగా,ఎరువుల నిల్వలతో కూడిన వివరాలను స్టాక్ బోర్డు పై తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు.యూరియా,ఇతర ఎరువుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా కల్పించారు.

# పటిష్టంగా మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లు

## - ఉప్పల్ స్టేడియంలో డిజిపి సమీక్ష





నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, డిసెంబర్ 11::**(నేటి శుభోదయ):** ఈనెల 13న నిర్వహించనున్న మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్‌కు సంబంధించిన భద్రత, సౌకర్యాలపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వాటర్ వర్క్స్, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, మ్యాచ్ నిర్వాహకులు పాల్గొని శాఖల ఏర్పాట్లను వివరించారు. డిజిపి మాట్లాడుతూప్రేక్షులకు ఇబ్బంది లేకుండా సురక్షిత, అనుకూల వాతావరణం కల్పించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్



మెస్సి పాల్గొనడం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను అత్యున్నత స్థాయిలో నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రేక్షకుల మార్గదర్శకాలు, భద్రతా నియమాలు, ట్రాఫిక్ మళ్లింపులపై విస్తృత ప్రచారం చేయాలని, ఇందుకోసం మెట్రో రైళ్లు, నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని డిజిపి అధికారులకు ఆదేశించారు. ఉప్పల్ స్టేడియం సామర్థ్యం, విభాగాల వివరాలు కూడా సమీక్షలో వెల్లడయ్యాయి. 23 ఎకరాల్లో విస్తరించిన ఈ అంతర్జాతీయ స్థాయి స్టేడియం నాలుగు సెక్టర్లుగా విభజించబడిందని, సుమారు 39 వేల మంది కూర్చునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సమన్వయంతో పనిచేసి మ్యాచ్‌ను ఎటువంటి లోపం లేకుండా విజయవంతం చేయాలని డిజిపి దిశానిర్దేశం చేశారు. సమీక్షలో అదనపు డిజిపి (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం. భగవత్, డిజి ఎస్పీఎఫ్ స్వాతి లక్రా, అదనపు డిజిపి చారు సిన్హా, ఇంటెలిజెన్స్ అదనపు డిజిపి విజయ్‌కుమార్, డిజి ఫైర్ సర్వీసెస్ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ లో ప్రశాంతంగా ప్రారంభమైన పోలింగ్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11 నేటి శుభోదయ: నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది.వణికించే చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు.జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఎడపల్లి మండలం జానకంపేట,ఎం.ఎస్.సీ ఫారం లలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును,పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.కలెక్టర్ వెంట అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.




# కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి

## మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



చింతూరు డివిజన్ (నేటి శుభోదయ): సూపర్ సిక్స్ హామీలంటూ అధికారంలోకి వచ్చి హామీలు నెరవేర్చకుండా మోసంచేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం చింతూరులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగభృతి, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 1,500 హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ముంపు మండలాల్లో వరదలు సంభవిస్తే ప్రభుత్వ పరంగా అన్నివిధాలా అదుకోవడం జరిగిందని



తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే వరదల సమయంలో బాధితులను పట్టించుకోలేదని, ప్రభుత్వం నుండి సరైన సాయమూ అందేలా చూడలేదని ఆమె విమర్శించారు. 2022 వరదలను దృష్టిలో వుంచుకుని అప్పటి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం చింతూరుతో సహా 32 గ్రామాలను ప్రాధాన్యతా క్రమంలో చేర్చి పరిహారం అందేలా చర్యలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. అప్పటి. తమ ప్రభుత్వం కృషి ఫలితంగా ప్రస్తుతం నిర్వాసితుల ఖాతాల్లో సొమ్ములు జమవుతుంటే అదేదో తామే చేసినట్లుగా కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆమె ఎద్దేవా చేసారు. ప్రతిపక్షంలో వున్నా అధికారంలో వున్నా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగిందని ఓటమి చెందినా ప్రజల వెన్నంటే వుంటానని ధనలక్ష్మి అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం కోతలు విధిస్తూ పథకాలు అమలుచేస్తున్న విషయం ప్రజలు గ్రహిస్తున్నారని ఆమె తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయాలి: గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం! చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ధనలక్ష్మి పిలుపునిచ్చారు. దీనికోసం గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటుచేసి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పాటు పడాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యల తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, కార్యకర్తలు ఎవ్వరూ భయపడవద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా వుంటుందని ఆమె భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం ఆమల, వైస్ ఎంపీపీలు యడమ ఆర్జున్, మేడేపల్లి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జిక్రియా, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ , పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్లు, వివిధ గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోస్టాఫీసు తో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిది

## ప్రజాసేవకు నిలువెత్తు రూపం పోస్టాఫీస్




ఖమ్మం, ఇల్లందు, నేటి శుభోదయ ::: సమాచార వ్యవస్థలో కీలకపాత్రను పోషించి, ప్రజల హృదయాలలో ఉన్నత స్థానాన్ని పొందిన పోస్ట్ ఆఫీస్ తో జర్నలిస్టుల అనుబంధం మరువలేనిదని సీనియర్ జర్నలిస్ట్ ఎస్. వి. సూర్యనారాయణ పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం ఇల్లందు ప్రాంతంలో పనిచేసిన జర్నలిస్టులు పోస్ట్ ఆఫీస్ అందించిన సేవలను ఎప్పటికీ మరువలేరని సూర్యనారాయణ ఈ పత్రికా ప్రతినిధి కి తెలిపారు. భారత తంతి తపాలా శాఖకు చెందిన స్థానిక పోస్ట్ ఆఫీస్ లో అప్పట్లో పోస్టల్ సేవలతో పాటు టెలిగ్రామ్, టెలిఫోన్ సౌకర్యాలు ఉండేవని, ప్రజలకు అవి ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. ఆ రోజులలో ఇల్లందు నుంచి విజయవాడలోని దినపత్రికల ప్రచురణ కేంద్రాలకు వార్తలను పంపటానికి జర్నలిస్టులకు పోస్ట్ ఆఫీస్ ప్రధాన ఆధారంగా ఉండేది. అప్పట్లో ప్రతిరోజూ వార్తల కవరును పంపడానికి కవరుపై మూడు రూపాయల పోస్టల్ స్టాంప్స్ అతికిస్తే సరిపోయేదని, పోస్ట్ ఆఫీస్ కు సెలవు వస్తే వార్తలను పంపటానికి అవకాశం ఉండేది కాదని, ఈరోజు పంపిన కవరు రేపు అందితే ఎల్లుండి పత్రికలలో వార్తలు వచ్చేవని తెలిపారు. చాలా ముఖ్యమైన వార్తలను పంపటానికి పత్రికాసంస్థలు జర్నలిస్టులకు ప్రెస్ బేరింగ్ అథారిటీ కార్డులను ఇచ్చేవారు. భారత తంతి తపాలా శాఖచే జారీ చేయబడిన ఇన్లాండ్ ప్రెస్ టెలిగ్రామ్స్ క్రెడిట్ కార్డు ద్వారా జర్నలిస్టులు విజయవాడకు ప్రెస్ టెలిగ్రామ్స్ పంపించేవారు.సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని ఆ రోజులలో టెలిప్రింటర్స్, కంప్యూటర్స్ లేవు.మోర్స్ సిస్టం ద్వారా ప్రెస్ టెలిగ్రామ్స్ ఇల్లందు పోస్ట్ ఆఫీస్ నుంచి ఖమ్మం కు పంపించేవారు. ఖమ్మం నుండి అక్కడి సిబ్బంది వాటిని విజయవాడకు పంపించేవారు. పోస్ట్ ఆఫీస్ లో ప్రెస్ టెలిగ్రామ్ కు తపాలా శాఖ సిబ్బంది ఎంతో ప్రాధాన్యత నిచ్చేవారు. ప్రెస్ టెలిగ్రామ్స్ ఇచ్చిన వెంటనే ఖమ్మం కు పంపించేవారు. ప్రెస్ టెలిగ్రామ్ ఫామ్స్ ను జర్నలిస్టులకు పోస్ట్ ఆఫీస్ లో ఉచితంగా ఇచ్చేవారు. ప్రెస్ టెలిగ్రామ్ పై బి.జి. క్యు. అని రాస్తే ఆర్డినరీ టెలిగ్రామ్ గా, బి. జీ.ఎక్స్.క్యూ. అని రాస్తే ఎక్స్ప్రెస్ టెలిగ్రామ్ గా, బి.జీ.ఎఫ్. ఎక్స్. క్యు. అని రాస్తే ఫ్లాష్ టెలిగ్రామ్ గా పరిగణించేవారు. జర్నలిస్టులకు ఫ్లాష్ టెలిగ్రామ్ అత్యవసర పరిస్థితులలో బాగా ఉపయోగపడేది. ఇది ఇస్తే అన్ని టెలిగ్రామ్స్ ఆపి మొదట వీటిని గమ్యస్థానానికి పంపించేవారు. ఇల్లందు ప్రాంతంలో అప్పట్లో జర్నలిస్టులు ఎంతో కష్టపడి వార్తలను సేకరించి విజయవాడకు పంపించేవారు. జర్నలిస్ట్ లు పోస్ట్ ఆఫీస్ లో పోస్ట్ చేసిన వార్తల కవర్లన్నింటిని సత్వరమే ఎంతో పదిలంగా విజయవాడ లోని పత్రికా కార్యాలయాలకు అందించటం పోస్టల్ సిబ్బంది అంకితభావంతో కూడిన విధి నిర్వహణకు నిలువెత్తు నిదర్శనంగా భావించవచ్చునని సీనియర్ జర్నలిస్ట్ సూర్యనారాయణ ప్రశంసించారు. ప్రజలకు, జర్నలిస్టుకు విశిష్ట సేవలు అందించిన నాటి, నేటి పోస్టల్ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# డిసెంబర్ 21 న జరిగే

## అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి



చింతూరు డివిజన్ (నేటి శుభోదయ): ఉమ్మడి భద్రాచలం డివిజన్ సిపిఎం పార్టీ నాయకులు అమరజీవులు ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవుల సంస్మరణ సభ డిసెంబర్ 21 న చింతూరులో జరుగుతుందని సభలో అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ పిలుపునిచ్చారు గురువారం నాడు మధుగూరు గ్రామంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీసం సురేష్ మాట్లాడుతూ 40ఏళ్ళు గా ఈ ప్రాంతంలో %ఎజూఎ% పార్టీ గా ప్రజా సమస్యల పై వెట్టి చాకిరీ, బీపీఎల్ కులీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ సిపిఎం పార్టీ పోరాటాలు నిర్వహించి ఈ ప్రాంతంలో విచిన్నకర ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాల అవలబించే రాడికల్స్ నెక్సల్స్ ను ఎదుర్కొని ప్రాణాలను విడిచిన అమరవీరులు త్యాగాని స్మరిస్తూజరిగే సంస్మరణ సభను జయప్రదం చేయాలని అమరవీరుల కామ్రేడ్ బత్తుల భీష్మరావు, బండారు చంద్రరావు, పులి రామయ్య, పట్రా ముత్యం, మడకం గంగారాజు, కుంజా సీతారామయ్య, బ్రహ్మయ్య, అనేక మంది ఆనాటి రాడికల్స్ నేటి మావోయిస్టులచే హత్య గావించబడ్డారని ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు గా పని చేసి ఈ ప్రాంత అభివృద్ధికి పాటుబడిన మాజీ ఎమ్మెల్యేలు కుంజ బొజ్జి సున్నం రాజయ్య ఈ మండలంలో వేక అప్పారావు సవలం సీతారామయ్య ఎడమ రామయ్య అనేకమంది అమరజీవులు ఉన్నారని వారు ఫలితంగానే ఈ ప్రాంతంలో విద్యా వైద్యం, సాగునీరు రోడ్డు, సౌకర్యాలు ప్రజానీకం సమస్యలు అనేకం మెరుగుపడ్డాయని అమరులు త్యాగాలను స్మరిస్తూ చింతూరులో జరిగే అమరవీరుల సంస్వర్ణ సభను జయప్రదం చేసే బాధ్యత సిపిఎం పార్టీ సభ్యులుగా నువ్వు కార్యకర్తలుగాను ప్రతి ఒక్కరూ బాధ్యత అని ఈ సభను అతిధికంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో కారం సుబ్బారావు, కారం మనోజ్, వినోద్, సీతారామయ్య, భారతి భద్రమ్మ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవాలు నిషేధం

## - జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపిఎస్.




నేటి శుభోదయ వికారాబాద్ 11 డిసెంబర్: ఎన్నికల ఫలితాలు వచ్చినా ర్యాలీలు, బైక్ శోభాయాత్రలు పూర్తిగా నిషేధం నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తప్పవు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపిఎస్. జిల్లాలో మూడు దశల పంచాయతీ ఎన్నికల పూర్తి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోనే కొనసాగుతుందని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపిఎస్ పేర్కొన్నారు.తొలి దశ ఫలితాలు వచ్చినా గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు వంటి వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. ఏం సి సి కొనసాగుతున్నంతకాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాల్సిందే.నియమాలను అతిక్రమించే వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. శాంతియుత వాతావరణం కోసం ప్రజలు, నాయకులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ గారు కోరారు.


# ఆగని అక్రమ రేషన్ బియ్యం దందా

## చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం

## లక్షల్లో లాభార్జన -పేదల కడుపు కొడుతున్న అక్రమార్కులు



అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం డిసెంబర్ 11 నేటి శుభోదయ: మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నదని అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దేవారం శరభవరం, ఇందుకూరు మరియు ఇందుకూరుపేట పంచాయతీతో పాటు మరికొన్ని గ్రామాల్లో బియ్యం నిల్వ కేంద్రాలను పెట్టుకొని ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బొలేరో వాహనాల్లో నింపి, గోకవరంలో రేషన్ బియ్యం నిల్వ కేంద్రాలను అడ్డాగా చేసుకుని గోకవరం మరియు కోరుకొండ తదితర మిల్లులకు తరలిస్తూ వ్యాపారులు లక్షల్లో అక్రమార్జన చేస్తున్నారు. మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నదని అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శరభవరం, ఉప్పయ్య పాలెం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఈ వ్యాపారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని ద్విచక్ర వాహనాలపై అక్రమ రేషన్ బియ్యాన్ని నిల్వ కేంద్రాలకు తరలించి అంతర్రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని పలువురు తెలియజేశారు. సంబంధిత అధికారులు వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..




# ఎర్రరాయి మాఫియా

## ఎన్ని వార్తలైనా రాసుకోండి పట్టించుకునే నాధుడే ఉండడు



**నేటి శుభోదయ వికారాబాద్ 11 డిసెంబర్: బంట్వారం మండలంలోని తోర్మామిడి, బస్వాపూర్, బొపునారం, గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమంగా ఎర్రరాయి కోసి సొమ్ము చేసుకుంటున్నరు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ అసైన్డ్ భూముల్లో, పట్టా భూముల్లో అక్రమ ఎర్రరాయి రావాణాకు పాల్పడుతున్నరు. ఎర్రరాయి కోసి అమ్ముకోవడంతో పెద్ద పెద్ద గుంతలుగా, లోయలుగా, ఎడారి ప్రాంతంగా కనిపిస్తున్న అసైన్డ్, పట్టా భూములు. గ్రామంలో ఎర్రరాయి కొయ్యొద్దు అని మొరపెట్టుకున్నా కూడా మాఫియా ఆగడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి ఈ అక్రమ ఎర్రరాయి తరలింపును అరకట్టాలి అంటున్నరు.**

## 'హౌసింగ్ బోర్డు కాలనీ'లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ 'మన ఊరు - మన ఎమ్మెల్యే - మన పల్లెబాట' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన..!

### జనవాణి కార్యక్రమానికి వెల్లువెత్తిన ప్రజానీకం, పలు సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యేకి అందజేసిన ప్రజలు





కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం రాజానగరం మండలం హౌసింగ్ బోర్డ్ కాలనీలో గురువారం ఉదయం 11 :00 గంటల నుండి స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యం లో జనవాణి - ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు 54 అర్జీలు ఆయనకు అందజేశారు. ఇళ్ళ స్థలాలు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, వీధి దీపాలు, రోడ్లు, గోదావరి నీరు సరఫరా చేయాలని అర్జీలు వచ్చాయి. ప్రజల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి తో పనిచేస్తోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెల్లడించారు. కాలనీ సమస్యలు గత సమావేశం లో స్వీకరించిన వాటిలో చాలా వరకూ పరిష్కారం





అయ్యాయని స్థానికులు తెలిపారని అన్నారు. కాలనీకి గోదావరి నది జలాల ద్వారా మంచి నీటి సరఫరా ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ప్రజావసరాలు అన్నీ తీరుస్తామని ఆయన తెలిపారు. ఈ పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం లో శాసన సభ్యుల వారి కార్యాలయ సిబ్బంది తో పాటు సి.వి.ఏ.పి.టీమ్ సభ్యులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో ఎన్డీయే కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు


### - డాక్టర్ మెతుకు ఆనంద్



నేటి శుభోదయ వికారాబాద్ 11 డిసెంబర్ : అఖండ-2 సినిమా ప్రీమియర్ షో, టికెట్ ధరల పెంపు జీవోను సస్పెండ్ చేస్తూ ఈరోజు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు లాంటిది. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి తాను సీఎంగా ఉన్నంత కాలం సినిమాలకు ఎక్స్ట్రా ప్రివిలేజెస్ ఉండవని, టికెట్ రేట్లు పెరగవని ప్రకటించి మాట మార్చి తెలంగాణలో సినిమాలకు టికెట్ రేట్లు పెంచుతూ - అడిషనల్ షోలకు పర్మిషన్ ఇస్తూ జీవోలు జారీ చెయ్యటం సిగ్గు చేటు. కనీసం అసెంబ్లీ సాక్షిగా ప్రజల క్షేమం కోసం ఇచ్చిన చిన్న మాట నిలబెట్టుకోలేని అసమర్ధ సీఎం గా చరిత్రలో నిలిచిపోనున్న రేవంత్ రెడ్డి. గతంలో సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సైతం బెనిఫిట్ షోలు, అడిషనల్ షోలు ఉండవు, టికెట్ రేట్లు పెంచము అని అసెంబ్లీ లోనే ప్రకటించిన మాటలు ఏమైనట్టు..? ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నామని, ప్రజల క్షేమం కోరి బెనిఫిట్ షో లు నిలిపేస్తున్నాం అని ప్రకటించారు. ప్రజలకి భారం కాకుండా టికెట్ రేట్లు పెంచేది లేదని అసెంబ్లీ సాక్షిగా తెగేసి చెప్పి పదే పదే జనాలని మోసం చేస్తున్న మీకు ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్నట్టు అయింది. ఇకనైనా భవిష్యత్తులో ప్రజల శ్రేయస్సుకోసం మాత్రమే ఆలోచిస్తారని ఆశిస్తున్నాం.

## కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సాఫీగా సాగిన ఓట్ల లెక్కింపు

### పర్యవేక్షణ జరిపిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11 నేటి శుభోదయ: గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది.ఓటింగ్ నిర్వహించిన మీదట సంబంధిత పోలింగ్ కేంద్రాలలోనే కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపు జరిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కౌంటింగ్ ప్రక్రియను ఆద్యంతం పర్యవేక్షణ జరిపారు.అత్యధిక ఓటర్లు కలిగిన నవీపేట గ్రామ పంచాయతీకి సంబంధించి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సైతం కౌంటింగ్ కేంద్రాలను విస్తృతంగా సందర్శిస్తూ ఓట్ల లెక్కింపు తీరును నిశితంగా పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఫలితంగా ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాఫీగా జరిగింది. అభ్యర్థులు,



వారి ఏజెంట్ల సమక్షంలో ఆయా టేబుళ్ల వారీగా కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు జరిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను విధిగా పాటిస్తూ,వెంటదివెంట ఓట్ల లెక్కింపు జరుపుతూ ఫలితాలు వెల్లడించారు.కౌంటింగ్ కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాలలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి,నిషేధాజ్ఞలు అమలు చేశారు.కౌంటింగ్ కేంద్రంలోనికి ఇతరులెవరిని అనుమతించలేదు.కౌంటింగ్ సిబ్బందితో పాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి ఎంట్రీ పాసులు జారీ చేసినప్పటికీ,వారిని సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌంటింగ్ విధులకు పంపించారు.సెల్ ఫోన్ లు,వీడియోలు,కెమెరాలను నిషేధించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్కో అధికారులు చర్యలు తీసుకున్నారు.పకడ్బందీ ఏర్పాట్ల నడుమ అభ్యర్థులు,వారి ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా,ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

## వేడుకగా వాటర్ షెడ్ వారోత్సవాలు



పులిచెర్ల, డిసెంబర్ 11,(నేటి శుభోదయ) : పులిచెర్ల మండలం మంగళంపేట, బోడిరెడ్డిగారిపల్లి వాటర్ షెడ్ పరిధిలో గురువారం వాటర్ షెడ్ వారవోత్సవాలు వేడుకగా జరిగాయి ఈ సందర్భంగా పులిచెర్ల సింగల్ విండో చైర్మన్ లెక్కల ధనంజయ నాయుడు, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, బండ్ల రమేష్ మాట్లాడుతూ వాటర్ షెడ్ పథకం ద్వారా నీటి సంరక్షణ చేయవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా వాటర్ షెడ్ పిఓ తేజస్విని వాటర్ షెడ్ వలన కలిగే ప్రయోజనాలు,రైతులకు లభించే వ్యవసాయ పరికరాలు గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ లు దురై రాజ్, షబీర్, జియాలజిస్ట్ ఉమ, రైతులు పాల్గొన్నారు.



# నిజామాబాద్ లో ప్రశాంతంగా మొదటి విడత పోలింగ్

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11 నేటి శుభోదయ: నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ





ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. వణికించే చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు.ఉదయం 9.00 గంటల సమయానికి సగటున 19.80 శాతం పోలింగ్ నమోదయ్యింది.11 గంటల సమయానికి 50.73 శాతం ఓటింగ్ పూర్తయ్యిందని అధికారులు ప్రకటించారు.కాగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఎడపల్లి మండలం జానకంపేట,ఎం.ఎస్.సీ ఫారంలలో, బోధన్ మండలం పెగడాపల్లిలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును,పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.హెల్ప్ డెస్క్ లు,మెడికల్ క్యాంపు,ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా?అని తనిఖీ చేశారు.కలెక్టర్ పర్యవేక్షణలో బోధన్,చందూర్,కోటగిరి,మోస్రా, పోతంగల్,



రెంజల్,రుద్రూర్,సాలూర,వర్ని,ఎడపల్లి,నవీపేట మండలాల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.మొదటి విడతలో మొత్తం184 సర్పంచ్ స్థానాలకు గాను,నామినేషన్ల ఉపసంహరణ నాటికే 29 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.దీంతో మిగిలిన 155 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు



నిర్వహించారు.అదేవిధంగా మొత్తం1642 వార్డు స్థానాలకు గాను 07 స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు.మరో 575 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.వీటిని మినహాయిస్తూ,1060 వార్డు స్థానాలకు తొలి దశలో ఎన్నికలు జరిగాయి.11 మండలాల పరిధిలో 1440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా,భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మొదటి రెండు గంటల వరకు ఒక మోస్తరుగా సాగిన ఓటింగ్,అనంతరం వేగం పుంజుకుంది.ఉదయం 11 గంటల సమయానికే 50 శాతానికి పైగా ఓటింగ్ నమోదయ్యింది.జిల్లా ఎన్నికల అధికారి వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం సత్ఫలితాలు ఇచ్చింది.ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ ప్రతి నివాస ప్రాంతంలో వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు,ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం,బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు





వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని,ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు.71 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని,31 కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపించామని,40 పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారని అన్నారు.కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ తీరును,స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరిగిందన్నారు.మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగగా,నిర్ణీత సమయంలోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించారు.అనంతరం మధ్యాహ్నం 2.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టారు.కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.కాగా ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సైతం పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా సందర్శిస్తూ ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలన జరిపారు. పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మండలం సులేమాన్ నగర్,వర్ని మండలం సత్యనారాయణపురం, చందూర్, మోస్రా,బోధన్ మండలం అమ్దాపూర్,ఎడపల్లి తదితర చోట్ల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలించారు.పోలీస్ కమిషనర్ సాయి చైతన్య,అదనపు డీసీపీ బస్వారెడ్డి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో తుది పోలింగ్ 81.37 శాతంగా నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు.

## పిల్లల మనోవికాస కేంద్రాన్ని ప్రారంభించిన సిపి సాయి చైతన్య




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11 నేటి శుభోదయ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డాక్టర్ విశాల్ పిల్లల మనోవికాస నూతన భవనం ప్రారంభోత్సవం ఏర్పాటు చేసినట్లు ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ తెలిపారు.ఈ నూతన భవన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సిపి సాయి చైతన్య మాట్లాడుతూ.. ముఖ్యంగా నేటి రోజులలో పిల్లలను నేటి టెక్నాలజీ యుగంలో అనేక రకాలుగా బుద్ధిమాంద్యం ఆలోచన సరలి నడుచుకునే విధానంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇటువంటి వారి కొరకై నిజామాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసినటువంటి ఈ మనోవికాస కేంద్రాన్ని నిజాంబాద్ లో డాక్టర్ విశాల్ ప్రారంభించడం అభినందనీయమని అన్నారు.అనంతరం ఆసుపత్రి తరపున సిపి సాయి చైతన్యకి శాలువాతో సత్కరించి మెమోంటో పూల మొక్కను బహుకరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విశాల్ భార్య డాక్టర్ నాగ పద్మ వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్లు రవీందర్ రెడ్డి,జీవన్ రావు,శ్రీధర్ రాజు,జార్జిరెడ్డి,అజ్జ శ్రీనివాస్,హరీష్ స్వామి,రమనేశ్వర్,రాజేష్, కృష్ణమూర్తి, కౌలయ్య లు వివిధ విభాగాలను ప్రారంభించి డాక్టర్ విశాల్ కి అభినందనలు తెలిపారు.అలాగే ప్రారంభోత్సవానికి విచ్చేసినటువంటి డాక్టర్లకు డాక్టర్ విశాల్ శాలువాలతో సత్కరించి పూల మొక్కలను మెమొంటోలను అందజేశారు.



## పులిచెర్ల మండలం యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక




పులిచెర్ల, డిసెంబర్ 11,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం. యుటిఎఫ్. నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా దేవేందర్ రెడ్డి,అధ్యక్షులుగా హరినాథ్ రెడ్డప్ప,సహాధ్యక్షులుగా. రామానుజులు... వరలక్ష్మి... ప్రధాన కార్యదర్శిగా. జవహర్ ఆలీ.. కోశాధికారిగా రఫీ. జిల్లా కౌన్సిలర్ గా మహేంద్ర... సదాశివరెడ్డి... మండల కౌన్సిలర్ గా. కామేశ్వర.. కరుణాకర్ రెడ్డి. చంద్రశేఖర్ రెడ్డి.. మహర్షి. లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఈశ్వర మహేంద్ర.. ఎన్నికల పరిశీలకులుగా సదాశివరెడ్డి వ్యవహరించారు.. ఈ సందర్భంగా. ఈశ్వర్ మహేంద్ర.. సదాశివరెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్ వేయాలని కోరారు.



## ముస్తఫానగర్ యూ.పి.హెచ్.సి. ని సందర్శించిన డి.ఎం.హెచ్.ఓ రామారావు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోగల ముస్తఫానగర్ లోని యూ.పి.హెచ్.సి. ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది విధుల్ని, అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. డా. రమేష్ తో కలిసి ఏ.ఎన్.ఎం, ఆశ కార్యకర్తలకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఏ.ఎన్.సి. కేసులు, డ్రగ్ స్టోర్ మానేజ్మెంట్ , లాబోరేటరీ సేవలు , ఇమ్యూనైజేషన్ ఆక్టివిటీస్ , ఎన్.సీ.డీ. స్క్రీనింగ్, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రికార్డ్స్ , బయో - మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ను ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని విభాగాల రికార్డుల నిర్వహణ, సేవల నాణ్యత, ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి సమగ్రంగా తెలుసుకుని, మరింత మెరుగ్గా పనిచేయడానికి అవసరమైన సూచనలు అందించారు.



## పాలేరులో కాంగ్రెస్ 'పవర్ షో'

### తిరుమలాయపాలెంలో తమ్ముడు, నేలకొండపల్లిలో మేనల్లుడు దయాకర్ రెడ్డి
### ప్రచార వేగాన్ని రెట్టింపు చేసిన అధికార పక్షం
### అభివృద్ధి, సంక్షేమాల సందేశం ప్రజల్లోకి బలంగా



తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, నేటి శుభోదయ ::: రెండో విడత గ్రామపంచాయతీ ప్రచారం ముగియడానికి కేవలం ఒకరోజు మాత్రమే మిగులుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యకలాపాలను మరింత వేగవంతం చేసింది. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ నేతలు ఇంటింటికీ తిరిగి హడావిడి చేస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్నారు. తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తమ్ముడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి ముజాహిద్‌పురం, కాకరవాయి, బీరోలు, ఏలువారిగూడెం గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లి మండలంలో మంత్రి మేనల్లుడు, క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగాపురం తండా, అప్పలనరసింహాపురం, రాయగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రజల





మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార సభల్లో వారు మాట్లాడుతూ "పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో పాలేరు అభివృద్ధి బాటలో వేగంగా దూసుకుపోతోంది. గ్రామ స్థాయిలో ఈ అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ , మిత్రపక్షాలు బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులు గెలవాలి" అని పిలుపునిచ్చారు. మంత్రి పొంగులేటి తమ్ముడు ప్రసాద్ రెడ్డి, మేనల్లుడు దయాకర్ రెడ్డి ఇద్దరూ ప్రచార రంగంలో దూకుడుగా దిగడంతో పాలేరు మొత్తం కాంగ్రెస్ శక్తి ప్రదర్శనతో కోలాహలంగా మారింది. గ్రామాల్లో కాంగ్రెస్ నేతల జోరు, ప్రజల్లో కనిపిస్తున్న ఉత్సాహం ఇవి రెండూ అధికార పార్టీకి అనుకూలంగా వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

## పోలింగ్ సరళిని పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుధామా రావు

### చింతకాని, కొణిజర్ల, వైరా, రఘునాథ పాలెం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన సాధారణ ఎన్నికల పరిశీలకులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: పంచాయతీ ఎన్నికలు మొదటి విడత పోలింగ్ సందర్భంగా గురువారం సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీ చరణ్ సుధామా రావు చింతకాని మండలంలోని పందిళ్లపల్లి, జగన్నాధపురం చింతకాని, కొణిజర్ల మండలంలోని పెద్దగోపతి, వైరా మండలంలోని తాటిపూడి, రఘునాధపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీ చరణ్ సుధామా రావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలు



ప్రశాంతంగా ఖమ్మం జిల్లాలో జరుగుతున్నాయని,





ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి తమ ఓటు హక్కు వినియోగించు కున్నారని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ కూడా కట్టుదిట్టంగా నిర్వహణకు అని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో వార్డు సభ్యులు, సర్పంచ్ కౌంటింగ్ ముగిసిన తర్వాత ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. ఈ పర్యటనలో మండల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా కు అంతరాయం

నేటిశుభోదయ-గోకవరం.: గోకవరం మండలం లోని అభివృద్ధి కార్యక్రమములో భాగముగా 11కె.వి మల్లవరం లోకల్ ఫీడరును ఆర్.డి.ఎస్.ఎస్ పథకంలో క్రొత్త లైను వేయు నిమిత్తమై ది. 12.12.2025, శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటవరకు గోకవరం మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాధపురం, మల్లవరం, భూపతిపాలెం,శివ రామ పట్నం, ఉమ్మెత్త గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. కావున వినియోగదారులు సహకరించాలని ఎద్యుక్యూటి ఇంజనీర్ జె.పి.బి నటరాజన్ తెలిపారు.

## ప్రశాంతంగా మొదటి విడత పంచాయతీ ఎన్నికలు

### - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### మొదటి విడత పోలింగ్ 90.08 శాతం నమోదు

### రఘునాథపాలెం మండలం వివి పాలెం జెడ్పీహెచ్ఎస్, కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ లలో పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, నేటి శుభోదయ ::: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఖమ్మం జిల్లాలో 90.08 శాతం నమోదైందని



అన్నారు. ఉదయం 9 గంటల వరకు 23.29 శాతం, 11 గంటల వరకు 52.25 శాతం, 1 గంట వరకు 86.95 శాతం పోలింగ్ నమోదైందని, 1 గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని, మొత్తం ఖమ్మం జిల్లాలో 90.08 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. మొదటి విడత పోలింగ్ జరిగిన బోనకల్ మండలంలో 90.85 శాతం,



చింతకాని మండలంలో 91.05 శాతం, కొణిజెర్ల మండలంలో 89.61 శాతం, మధిర మండలంలో 90.08 శాతం, రఘునాథపాలెం మండలంలో 91.09 శాతం, వైరా మండలంలో 90.67 శాతం, ఎర్రుపాలెం మండలంలో 87.28 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కలెక్టరెట్ నుంచి



నిరంతరం మానిటరింగ్ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కౌంటింగ్ ముగిసిన తర్వాత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సందర్భంగా రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం జెడ్పీహెచ్ఎస్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ అధికారులు ఎన్నికల నియమావళి మేరకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ నుండి సాధారణ పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి పోలింగ్ సరళి పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం అభివృద్ధికి టీటీడీ పూర్తి సహకారం

### - టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు



హైదరాబాద్, నేటి శుభోదయ ::: శ్రీశైలం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హామీ ఇచ్చారు. హైదరాబాదులో టీవీ5 ప్రధాన కార్యాలయంలో గురువారం శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలని బోర్డు పాలకమండలి బీఆర్ నాయుడును కోరారు. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీశైలంలో అన్ని హంగులతో కాటేజులు నిర్మాణం చేపట్టాలని, శ్రీశైలం దేవస్థాన ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని వారు కోరారు. శ్రీశైలం దేవస్థానాన్ని సందర్శించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని, త్వరలో శ్రీశైలం వస్తానని బీఆర్ నాయుడు తెలిపారని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, మహానాడు మీడియా అధినేత, బోర్డు సభ్యులు బోడేపూడి వెంకటసుబ్బారావు (బిఎస్ఆర్ ) మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో పాలకమండలి సభ్యులు ఏవి రమణ,ఆలా అనిల్ కుమార్, శంకరశెట్టి పిచ్చయ్య, మురళీధర్, కోడె క్రాంతి వర్ధిని, శ్రీదేవితోపాటు ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాము

### సోదరుడు బాబ్జి భగవంతుడు దీవెనలతో

### నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలి: ఎమ్మెల్యే రాము



గుడివాడ, డిసెంబర్ 11( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) సీనియర్ టిడిపి నాయకులు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు పిన్నమనేని బాబ్జి పుట్టినరోజు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి.



రాజేంద్రనగర్ లోని ఆయన స్వగృహంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబ్జిను ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ ఎమ్మెల్యే రాము పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాముతో కలిసి కేక్ కట్ చేసిన బాబ్జి పార్టీ నేతలకు తినిపించారు. సోదర సమానుడైన బాబ్జికు దేవుడు మంచి ఆరోగ్యం, సంతోషం, దీరాయుషు ఇవ్వాలని ఎమ్మెల్యే రాము అన్నారు. బాబ్జి మరిన్ని పుట్టిన రోజులు జరుపుకుంటూ, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నందివాడ టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు చేకూరి జగన్మోహన్రావు, నందివాడ మండలం, గుడివాడ పట్టణానికి చెందిన పలువురు నాయకులు బాబ్జి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు.

# ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- ఎమ్మెల్యే రాముకు...
- 152 సమస్యల అర్జీలను అందించిన... స్థానిక ప్రజానీకం
- సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకొని.... పలు అర్జీలను తక్షణమే పరిష్కరించిన ఎమ్మెల్యే
- గుడివాడ మార్పులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.
- డీడీల నగదు చెల్లించి గత ప్రభుత్వ మోసంతో ఫ్లాట్ అందుకొని టిడ్కో లబ్ధిదారులకు.... తిరిగి నగదు చెల్లిస్తాం



గుడివాడ డిసెంబర్ 11 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) అందరం కలిస్తేనే సమాజం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, మనం అన్న ఆలోచనలతో ముందుకు సాగుతూ గుడివాడ మార్పులో భాగస్వామ్యులు కావాలని ప్రజానీకానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. గుడివాడ పట్టణంలోని 1,36 వార్డుల పరిధిలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రజా దర్బార్



కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అధికారులతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించిన ఎమ్మెల్యే రాము ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రజా దర్బార్ లో పాల్గొన్న 1,36 వార్డుల ప్రజానీకం వివిధ సమస్యలపై ఎమ్మెల్యే రాముకు 152 అర్జీలను అందజేశారు. అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పలు సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆర్థికపరమైన, ప్రభుత్వ పాలసీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అర్జీలు అందించిన వారికి భరోసా ఇచ్చారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి గుడివాడ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని, పారిశుధ్య మెరుగుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చినట్లు వెల్లడించారు. గుడివాడ మార్పు కోసం కష్టపడుతున్న అధికారులను ఎమ్మెల్యే రాము అభినందించారు. నేడు నిర్వహించిన ప్రజాదర్బాల్లో అత్యధికంగా పెన్షన్లు, జిల్లా సమస్యలు , టిడ్కో సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు.పి. జే. ఆర్. రూపంలో ప్రజల నుండి తీసుకున్న ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఎంతో మంచి సంకల్పంతో టిడ్కో ఇళ్లను నిర్మిస్తే గత ప్రభుత్వం లబ్ధిదారులకు అన్యాయం చేస్తూ ఫ్లాట్లను అమ్ముకుందని ఆరోపించారు. ఇటీవల అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి నష్టపోయిన లబ్ధిదారుల అనేక సమస్యలను పరిష్కరించారన్నారు.25వేలు,50వేలు నగదు చెల్లించి ఇంకా ఫ్లాట్ అందుకొని వారికి తిరిగి నగదు ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వ స్థలం కూడా ఇస్తామన్నారు. ప్రభుత్వ పాలసీ వచ్చిన వెంటనే, అర్జీదారుల ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్, ఇంటి స్థలానికి దరఖాస్తు ప్రక్రియ అధికారులే చేపడతారని ఎమ్మెల్యే రాము అన్నారు. అంతేకాకుండా పేద ప్రజలు తమ సొంత ఇంటి కలను నిజం చేసుకునేందుకు, స్థలం ఇవ్వడమే కాకుండా రూ1.80 లక్షల నుండి రూ.2.50 లక్షల వరకు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వ సహాయం అందిస్తుందని ప్రకటించారు. నేడు ప్రజా దర్బార్లో పాల్గొలేకపోయిన వారు గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో అర్జీలు ఇవ్వవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తాసిల్దార్ కిరణ్, వన్ టౌన్ సి. ఐ.శ్రీనివాస్,ఎం. ఇ. ఓ. రజిని, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, గోర్జి సత్యనారాయణ, చేకూరు జగన్ మోహన్ రావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు,పొట్లూరి కృష్ణారావు, లోయ వాసు, పెద్దూ వీరభద్రరావు, సయ్యద్ జబీన్, మున్సిపల్ ప్రసాద్, శివాజీ, రాజేష్, సచివాలయ ఉద్యోగులు, వసంతవాడ దుర్గారావు, దాసు శ్యామ్,రావూరి రాజు, యలవర్తి తిరుపతరావు, కంచర్ల చంటి, చంద్రశేఖర రావు, లక్ష్మణ, గురు స్వామి, పోలేరు రావు, రమాదేవి, ప్రొఫైల్, గొలుసు సతీష్,గొర్ల శ్రీలక్ష్మి, గొర్రెపత్తి ప్రసాద్, లోయ శివాజీ, దాసరి సురేష్, మెరుగుమాల బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు, కొలుసు రాజా, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్

### ఉపాధ్యాయుల ఆందోళనను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఏలూరు ఎంపీ

### 2010 ఆగస్టుకి ముందు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### విద్యా హక్కు చట్టానికి సవరణలు చేయాలన్న ఎంపీ


### ఇటీవల ఎంపీని కలిసి సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

### హామీ ఇచ్చిన ప్రకారం లోక్ సభలో 377 నిబంధన కింద టీచర్ల సమస్య ప్రస్తావించిన ఎంపీ



ఏలూరు, ఢిల్లీ, నేటి శుభోదయ ::: సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఈటి ) లో ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి 2010 ఆగస్టు నాటికి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాల్సిందిగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా గురువారం లోక్ సభలో 377 నిబంధన కింద టీచర్ల సమస్యను ఏలూరు ఎంపీ లేవనెత్తారు. సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయు లందరూ రెండేళ్ల లోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) లో ఉత్తీర్ణులు కావాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా లక్షలాదిమంది






ఉపాధ్యాయుల్లో అనిచ్చిత వాతావరణం సృష్టించిందన్నారు. విద్యా హక్కు చట్టం నియమాలు రూపొందించబడినప్పుడు 23 ఆగస్టు 2010 ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుండి మినహాయింపు ఇచ్చారనే విషయాన్ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు.15 నుంచి 30 సంవత్సరాలుగా సర్వీసులో ఉండి పాఠశాల విద్యా వ్యవస్థకు వెన్నుముకగా మారిన ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలని చెప్పటం ఆందోళన కలిగిస్తోందన్నారు. దశాబ్దాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ, తమ కెరీర్లో ఒక దశకు చేరిన ఈ ఉపాధ్యాయులను ఇప్పుడు ఈ ఎంట్రీ లెవెల్ పరీక్ష రాయమని బలవంతం చేయటం వారిని తీవ్రంగా బాధించిందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. అనేక సంవత్సరాల అనుభవం తర్వాత ఇప్పుడు ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాలేకపోతే ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వస్తే వేలాది తరగతి గదులు ఉపాధ్యాయులు లేని పాఠశాలలుగా మారవచ్చని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఆగస్టు 2010కి నాటికి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కలిగించేందుకు విద్యా హక్కు చట్టం మరియు ఎన్ సిటిఈ చట్టం 1993 కి సవరణలు చేయవలసిందిగా ఎంపీ కోరారు. ఇదే సమయంలో ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు సరైన చర్యలు తీసుకోవడానికి ఉపాధ్యాయ సంఘాలతో తక్షణం సమావేశాలు నిర్వహించాలని కూడా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కొద్దిరోజుల కిందటే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఏలూరు క్యాంపు కార్యాలయంలో కలిసి టెట్ సమస్యను వివరించి ఎంపీ సహకారం కోరారు. వారికి ఇచ్చిన మాట ప్రకారం సమస్యను పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఎంపీకి ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి.

## మక్తగూడ సర్పంచిగా శ్రీరాములు ఘనవిజయం

### డిపీటి సర్పంచిగా ఎలుగని రాములు గౌడ్

### ప్రజల నమ్మకాన్ని అందుకున్న నాయకుడు అభివృద్ధే లక్ష్యం




షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి డిసెంబర్ 11: రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం మక్తగూడ గ్రామ పంచాయతీ డిప్యూటీ సర్పంచ్ గా ఎలుగని శ్రీరాములు ఘన విజయం సాధించారు గ్రామ ప్రజల విశ్వాసం ఆదరణతో స్పష్టమైన ఆధిక్యాన్ని తెచ్చుకున్న శ్రీరాములు ఫలితాలు వెలువడిన వెంటనే తమను ఆశీర్వదించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు గ్రామాభివృద్ధి పారదర్శకత ప్రజల సమస్యలకు వేగంగా స్పందన ఇవే ప్రధానంగా ముందుకు తీసుకెళ్తానని శ్రీరాములు హామీ ఇచ్చారు తాగునీరు రహదారులు వీధి దీపాలు డ్రైనేజీ వ్యవస్థతో పాటు గ్రామ యువతకు ఉపాధి అవకాశాల కోసం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు

ప్రజల ఆశలు నాయకత్వం పై విశ్వాసం

ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అపారమైన స్పందన వచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్న శ్రీరాములు నా మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను మక్తగూడ అభివృద్ధి నా ధ్యేయం అని అన్నారు గ్రామ పెద్దలు మహిళలు యువత రైతులు ఈ విజయాన్ని శుభాకాంక్షలతో స్వాగతించారు గ్రామం అభివృద్ధి దిశగా సాగుతుందన్న నమ్మకం వ్యక్తమైంది

## గూడూరు గ్రామంలో చరిత్రాత్మక విజయం

### ఉప్పల దయానంద్ గుప్తా సర్పంచిగా ఘన గెలుపు



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి డిసెంబర్ 11 ,: రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గూడూరు ప్రజల నమ్మకం ఆశీర్వాదాలతో ఉప్పల దయానంద్ గుప్తా స్పష్టమైన మెజారిటీతో సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నారు భారీ ఆధిక్యంతో గెలిచిన ఆయన విజయంపై గ్రామం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది గ్రామ అభివృద్ధి ప్రజా సంక్షేమం సమగ్ర వృద్ధి లక్ష్యంగా ప్రచారం చేసిన దయానంద్ గుప్తాకు ప్రజల నుండి అపారమైన మద్దతు లభించింది ఎన్నికల ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కట్టుబడి పనిచేస్తానని



నూతన సర్పంచ్ తెలిపారు విజయా నంతరం దయానంద్ గుప్తా మొదటి స్పందన గూడూరు అభివృద్ధి నా ఒకే లక్ష్యం. మీ ఆశలకు నిలబడి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు పనిచేస్తాను అని ఆయన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు గ్రామంలో విజయోత్సాహం మద్దతుదారులు పెద్ద ఎత్తున సెలబ్రేషన్స్ పూలదండలు, కేక్ కటింగ్స్‌తో సంబరాలు గ్రామ పెద్దలు యువత అభినందనలు అభివృద్ధి పథంలో గూడూరు ఉప్పల దయానంద్ గుప్తా విజయం నేపథ్యంలో గ్రామ ప్రజల్లో కొత్త ఆశలు వెల్లివిరుస్తున్నాయి రోడ్లు తాగునీరు కాలువలు విద్యుత్ సంక్షేమ పథకాల అమలు వంటి రంగాల్లో వేగవంతమైన పురోగతి ఉంటుందని ప్రజలు నమ్ముతున్నారు

## బోధన్ డివిజన్ పరిధిలో భవానిపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పోలింగ్ బూత్ మొదటి విడుత ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లు,పోలింగ్ సరళిని పరిశీలించిన పోలీస్ కమీషనర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11 నేటి శుభోదయ: గురువారము మొదటి విడత ఎన్నికలలో భాగంగా బోధన్ మండలంలోని భవానిపేట్ లో గ్రామపంచాయతీ పోలింగ్ బూత్ లను సందర్శించిన నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్.,ఆయా పోలింగ్ బూత్ ల వద్ద బందోబస్తు ఏర్పాట్లు,భద్రతా చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని,సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది.ప్రజలు శాంతి యూత వాతావరణంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా బోధన్ ఏ.సి.పి పి.శ్రీనివాస్,రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి సంబంధిత అధికారులు గలరు.

## ఎన్నికల సమరంలో కాంగ్రెస్ దే జయభేరి..

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి డిసెంబర్ 11 : ఎవరు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు జయభేరి మోగించడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆయన స్వగ్రామమైన నందిగామ మండలం వీర్లపల్లిలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల సమరంలో భాగంగా తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చానని వెల్లడించారు. 1990లో తన రాజకీయ ప్రస్తానంతోనే ప్రారంభమైందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. వీర్లపల్లి గ్రామంలో తాను కూడా సర్పంచ్ గా పని చేశానని గుర్తు చేశారు. గ్రామాభివృద్ధి బాధ్యత సర్పంచ్ల పైనే ఉంటుందని అలాంటి వ్యక్తులను ఎందుకనేటప్పుడు మంచివారిని, పనిమంతులను, విద్యావంతులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు. మొదటినుంచి వీర్లపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉంటుందని, ఈవిడత కూడా అదే పునరావృతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొని తమ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత గ్రామాభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా ఆయన వివరించారు..

## మహిళా సాధికారతపై చర్చలో పాల్గొన్న ఏలూరు ఎంపీ



ఏలూరు, ఢిల్లీ, నేటి శుభోదయ ::: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం సాయంత్రం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, మరికొందరు ఎన్డిఏ ఎంపీలతో కలిసి కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవితో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మహిళా సాధికారత, మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, అమలు అవుతున్న తీరు, ఇతర అంశాలపై చర్చ జరిగినట్లు ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

### అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ ధర్నాకు హాజరు కావాలని పిలుపు

### మినీ వర్కర్ల అర్హత సడలింపు, ప్రమోషన్ మార్గదర్శకాలు, వేతనంతో వైద్య సెలవు అమలు చేయాలని డిమాండ్



జీలుగుమిల్లి : (నేటి శుభోదయ): జీలుగుమిల్లి మండల సిఐటియు సమావేశంలో 18వ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ చిట్టిబొమ్మ కొండలరావు పిలుపునిచ్చారు. అంగన్వాడీలు, ఆశావర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మిక వర్గాల హక్కుల సాధనకు ఐక్యంగా నిలబడాలని కోరారు. నేడు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు అందరూ భారీగా తరలి రావాలని సూచించారు. సిఐటియు అధ్యక్షురాలు ఊర్ల నాగమణి మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల కోసం మార్గదర్శకాలు రూపొందించాలని, వేతనంతో కూడిన వైద్య సెలవులు ఇవ్వాలని, చిన్నారుల తల్లులకు తల్లికి వందనం పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని కోరారు. అనంతరం తెల్లం ఎస్తేరు మాట్లాడుతూ 18 ఏళ్లపాటు పనిచేసిన మినీ కార్మికులకు అర్హత సడలింపు ఇచ్చి ప్రధాన కార్యకర్తలుగా మార్చాలని అన్నారు. అంగన్వాడీ వ్యవస్థ గ్రామీణ స్థాయిలో బాలల పోషణ, ఆరోగ్యం, విద్యా అభివృద్ధికి కీలకమైందని ఆమె పేర్కొన్నారు. తగిన సౌకర్యాలు, భద్రమైన వేతనాలు, పదోన్నతి అవకాశాలు లేనందుకు కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం విశాఖపట్నంలో జరగనున్న మహాసభల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కులు వినిపించాలని సూచించారు. మహాసభలు కార్మిక వర్గాల స్వరం దేశవ్యాప్తంగా వినిపించడానికి గొప్ప వేదికనని, జీలుగుమిల్లి మండలంలోని అంగన్వాడీలు, ఆశావర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా హాజరుకావాలని సిఐటియు నేతలు పిలుపునిచ్చారు.

## కందకుర్తి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లని పోలింగ్ సరళిని పరిశీలించిన పోలీస్ కమీషనర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 11నేటి శుభోదయ : గురువారం మొదటి విడత ఎన్నికలలో భాగంగా రెంజల్ మండలంలోని కందకుర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ పోలింగ్ బూత్ లను సందర్శించిన నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్.,ఆయా పోలింగ్ బూత్ ల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని,సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది.ప్రజలు శాంతి యూత వాతావరణంలో తమ ఓటు హక్కును సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా బోధన్ ఏ.సి.పి పి.శ్రీనివాస్,రెంజల్ ఎస్సై చంద్రమోహన్ సంబంధిత అధికారులు ఉన్నారు.

# తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుదాం

### రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ విజయవాడలో మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి. త్రివిక్రమరావు (విక్రమ్ పూల) బాధ్యతల స్వీకరణ విక్రమ్ పూలతో ప్రమాణం చేయించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ, డిసెంబర్ 11 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) తెలుగు భాష గొప్పతనం, ఔన్నత్యాన్ని, కళా సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటుదామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ భవానీపురంలోని హరిత



బెర్మ్ పార్క్ లో మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి. త్రివిక్రమరావు (విక్రమ్ పూల) బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కు అతిథులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి, తెలుగు భాష కోసం తన జీవితాన్ని ధారబోసిన మండలి వెంకట కృష్ణారావు పేరును అధికార భాషా సంఘానికి పెట్టడం, తెలుగు భాష గొప్పతనం, ఔన్నత్యం గురించి తెలిసిన వ్యక్తిని అధికార భాషా సంఘానికి అధ్యక్షుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు. పాత్రికేయుడిగా, పుస్తక రచయితగా, విలువలతో కూడిన వ్యక్తిగా మంచి పేరున్న విక్రమ్ పూల అధికార భాషా సంఘానికి అధ్యక్షుడిగా నూటికి నూరుపాళ్ళు అర్హున్నారు. టిడిపి నాయకులు టిడి జనార్ధన్, విక్రమ్ పూల కలిసి "1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం సజీవ చరిత్ర" అనే పేరుతో పుస్తకాన్ని రాసి నాటి ఘటనలను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికార భాషా సంఘం ద్వారా తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడేందుకు అధ్యక్షుడిగా కృషి చేయాలని విక్రమ్ పూలకు సూచించారు. అధికార భాషా సంఘంలో గతంలో రాజకీయపరమైన నియామకాలుండేవని అన్నారు. రాజకీయ నిరుద్యోగులకు ఈ పదవి కట్టబెట్టే వారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఏ నామినేటెడ్ పదవి అయినా సంబంధిత రంగానికి చెందిన లబ్ద ప్రతిష్టులైన వ్యక్తులకే ఆ పదవులు ఇస్తున్నందుకు సీఎం చంద్రబాబు నాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అధికార భాషా సంఘం నిర్వర్తించాల్సిన కీలక బాధ్యతలను, కార్యాచరణను ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించిందని ఆ దిశగా పాటుపడాలని విక్రమ్



పూల కు సూచించారు. ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే ఉండాలని, గతంలో ఈ విధానానికి తిలోదకాలు ఇచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మాతృభాషలోనే విద్యా బోధన సాగుతుందని తద్వారే సమగ్ర వ్యక్తిత్వ వికాసం నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ సారధ్యంలో తెలుగు పెద్దపీట వేస్తున్నామని, అదే సందర్భంలో త్రిభాషా విధానం అనుసరిస్తున్నామన్నారు. విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. రాబోయే రోజుల్లో భాషా సాంస్కృతిక విధానాలు ముందుకు తీసుకెళదామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## నవీపేట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పోలీస్ కమీషనర్





నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్11 నేటి శుభోదయ : గురువారం మొదటి విడత ఎన్నికలలో భాగంగా నవీపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పోలింగ్ కేంద్రంను సందర్శించిన నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య,ఐ.పి.ఎస్.,ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు,భద్రతా చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని,సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది.ప్రజలు శాంతి యూత వాతావరణంలో తమ ఓటు హక్కును సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ ఏ.సి.పి రాజా వెంకటరెడ్డి,నిజామాబాద్ నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,నవీపేట్ ఎస్సై తిరుపతి అధికారులు గలరు.

## 1930 కు డయల్ చేసి ఫిర్యాదు చేయండి

### ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అవగాహన కార్యక్రమంలో ఎస్ బి ఐ. ఆర్.ఎం. రాజశేఖర్, సైబర్ క్రైమ్ విభాగ ఎస్.ఐ. రంజిత్, రైతుబజార్ ఈ. ఓ. శ్వేత




ఖమ్మం, నేటి శుభోదయ ::: సైబర్ నేరాలు జరిగితే వెను వెంటనే 1930 నెంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని, సైబర్ నేరాల పట్ల జాగృతగా ఉండాలని, ఎస్ బి ఐ. ఆర్.ఎం.రాజశేఖర్, ఎస్.ఐ. రంజిత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, రైతుబజార్ ఈ. ఓ. శ్వేత లు అన్నారు. గురువారం ఖమ్మంలోని ఆర్.బి.ఓ. కార్యాలయం, వీడియోస్ కాలనీలో గల ఇంటిగ్రేటెడ్ వెజిటబుల్ మార్కెట్ ఆవరణలో డిజిటల్ మోసాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడారు. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరుతో జరిగే కార్యక్రమంలో సైబర్ నేరాల నిలుపుదల పట్ల అవగాహన కార్యక్రమంను నిర్వహించినట్లు వారు తెలిపారు. ప్రస్తుత సమాజంలో వివిధ రకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయని, అందులోను సైబర్ మోసాల పట్ల విద్యార్థులు, యువత, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సైబర్ మోసాలను ముందస్తుగానే పసిగట్టి మోసాల బారిన పడకుండా ఉండాలని వారు సూచించారు. ఉదాహరణకు ఇద్దరు




ప్రముఖులు డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ప్రమాదాలు, నేరస్థుల ప్రమేయం, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేరడం వంటి తప్పుడు వాదనలతో బాధితులను బెదిరించే మోసపూరిత ఫోన్ కాల్స్ వంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. మోసపూరితమైన లావాదేవీలు జరిగినట్లు భావిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఖాతా ఉన్న బ్యాంక్ వారికీ వెంటనే తెలియజేయాలని ప్రజలను కోరారు. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలు, లాటరీ తగిలిందని డబ్బులు చెల్లించాలని, లేదా తమ ఏటీఎం కార్డులో 16 అంకెల నెంబర్ను తెలపాలని, ఓటిపి చెప్పాలని, మోసపూరిత ప్రకటనలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఆపరేషన్స్ ఫయాజ్ భాషా,జడ్పీ బ్రాంచ్ మేనేజర్ షేక్. ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు మండలం వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు

షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలంలో వివిధ గ్రామపంచాయతీలో గెలుపొందిన సర్పంచ్ల అభ్యర్థులు మక్తగూడ గ్రామపంచాయతీ నుండి శ్రీరాములు గూడూరు గ్రామ పంచాయితీ నుంచి ఉప్పల దయానంద్ గుప్త మల్లాపూర్ గ్రామపంచాయతీ నరసింహారెడ్డి మల్లాపూర్ తండా గ్రామ సర్పంచిగా ఆంగోతి మీనాక్షి తీగాపురం సర్పంచ్ అభ్యర్థిగా వీఆంగోతి మీనాక్షి తీగాపురం సర్పంచ్ అభ్యర్థిగా బి రగూడెం జయప్రదరగూడెం జయప్రద తమిళనాడు గ్రామపంచాయతీ నుండి లలిత నాయక్ కోడిచెర్ల తండా కోర శాంతి కొడితల గ్రామపంచాయతీ నుండి దయ్యాల నరసమ్మ వెంజర్ల గ్రామపంచాయతీ నుంచి ఎర్రోళ్ల జగన్ సేరిగూడ భద్రయ్యపల్లి నుండి మల్రెడ్డి సుమిత్ర సిద్దాపూర్ గ్రామపంచాయతీ ఇస్లావత్ బాసు నాయక్ ఏనుగు మడుగుతండ పతలవుతు గోవిందు లను ఎన్నికల అధికారులు ప్రకటించినరు

## డబ్బులు కాదు అభిమానమే ముఖ్యమని చూపించారు

### ప్రజలకు కాంగ్రెస్ నేత అంబటి ప్రభాకర్ కృతజ్ఞతలు



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి డిసెంబర్ 11: షాద్నగర్ నియోజకవర్గం లోని కొత్తూరు మండలంలోని శేరిగూడ భద్రాయపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు చూపిన తీర్పుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంబటి ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.డబ్బులు, బెదిరింపులకు భయపడకుండా, అభిమానమే ముఖ్యమని చాటిచెప్పిన గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యర్థుల బెదిరింపులను ప్రజలు తమ ఓటుతోనే సమాధానం చెప్పారని ప్రభాకర్ కొనియాడారు.సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిచిన మల్ రెడ్డి సుమిత్ర మల్లా రెడ్డి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇస్తూ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మల్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో తమపై చూపించిన అభిమానానికి, నమ్మకానికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.శేరిగూడ భద్రాయపల్లి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్న తీరు, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టిందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

## నాపై నమ్మకం ఉంచిన నా గ్రామ రుణం తీర్చుకుంటా

### మంత్రి పొంగిలేటి సహకారంతో అభివృద్ధికి బాటలు


### సర్పంచ్ అభ్యర్థి గోసు నాగమణిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు

### ప్రముఖ వ్యాపారవేత్త వత్సవాయి రవి



ఖమ్మం, కొణిజర్ల, నేటి శుభోదయ ::: అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగినటువంటి కొనిజర్ల మండలం కొండ వనమాల గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో తనపై నమ్మకంతో సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థిగోసు నాగమణి అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని ప్రముఖ వ్యాపారవేత్త వత్సవాయి రవి మాజీ మండల పరిషత్ అధ్యక్షులు గోసు మధు లు పేర్కొన్నారు.గురువారం జరిగినటువంటి గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినటువంటి నాగమణిని తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు రుణం తీర్చుకుంటానని గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతామని వారు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో గ్రామ అభివృద్ధికి ప్రత్యేకమైనటువంటి ప్రణాళికలు తయారుచేసి తమ సర్పంచ్ అభ్యర్థి నాగమణి ద్వారా అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలియజేశారు.అంగ బలం ఆర్థిక బలం అనేకమైనటువంటి ప్రలోభాలు ఎన్నో జరిగినప్పటికీ ప్రజలు పేద ప్రజలు బడుగు బలహీన వర్గాల ప్రజలు బీసీ బిడ్డకు అండగా నిలిచి ఎస్సి బీసీలు ప్రత్యేకమైనటువంటి సహకారంతోపాటు గ్రామ ప్రజలు ముందుకొచ్చి బీసీ ఆడబిడ్డను గెలిపించుకున్నారని వారు తెలియజేశారు.సర్పంచ్ అభ్యర్థిగా నాగమణిని గెలిపించి అనేక రోజులుగా అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించి పాల్గొని కృషిచేసి గెలుపుకు సహకరించినటువంటి గ్రామస్తులకు అభిమానులకు సానుభూతిపరులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సీఎం చంద్రబాబుని కలిసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి .



నేటి శుభోదయ 11 డిసెంబర్ నంద్యాల వార్త: వెలగపూడిలోని సచివాలయం నందు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని నేడు శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే శ్రీశైలం, మహానంది దేవస్థానాల అభివృద్ధి, సాగునీటి పథకాలకు నిధుల మంజూరుతో పాటు నియోజకవర్గంలో 100శాతం అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, త్రాగునీటి కుళాయి సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధికి మరింత తోడ్పాటును అందిస్తానని, పెండింగ్ లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి త్వరిత గతిన పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారు.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620

## గోల్డ్ కార్డును ప్రారంభించిన ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ప్రకటించిన 'గోల్డ్ కార్డు' విక్రయాలను అధికారికంగా బుధవారం ప్రారంభించారు. ఈ గోల్డ్ కార్డు ద్వారా ఒక మిలియన్ డాలర్లు చెల్లించిన వ్యక్తులకి అమెరికా పౌరసత్వం, చట్టపరమైన హోదా పొందే అవకాశం ఉంది. బుధవారం వైట్‌హౌస్ రూజ్‌వెల్ట్ రూమ్‌లో పారిశ్రామిక నేతలతో ఉన్న సమయంలో.. ఈ గ్రీన్ కార్డు దరఖాస్తుల్ని స్వీకరించే వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ గోల్డ్ కార్డు ఇబి-5 వీసాలను భర్తీ చేయనుంది. 1990లో విదేశీ పెట్టుబడి కోసం అమెరికన్ కాంగ్రెస్ ఇబి-5 వీసాలను రూపొందించింది. ఇది సంపన్నుల కోసమే సృష్టించడం జరిగింది. కనీసం పది మంది ఉద్యోగులను నియమించే కంపెనీలో ఒక మిలియన్ డాలర్లు ఖర్చు చేసే వారికి ఇది అందుబాటులో ఉండేది. అమెరికాలో అత్యున్నత ప్రతిభావంతుల్ని నిలుపుకోవడానికి, ప్రభుత్వానికి ఆదాయం రావడానికి ఈ గోల్డ్ కార్డు ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయడుతున్నారు. గతంలో ఈ గ్రీన్ కార్డు 5 మిలియన్ డాలర్లుగా ఉండేది. అయితే ట్రంప్ దీన్ని 1-2 మిలియన్లకే పొందేలా సవరించారు. కాగా, ఈ గోల్డ్‌కార్డు ప్రారంభించిన సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. 'ఈ కార్డులు పొందేవారిలో చైనా, భారత్, ఫ్రాన్స్‌లకు చెందిన యుఎస్ అగ్రశ్రేణి కాలేజీల్లో గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కంపెనీలు చాలా సంతోషంగా ఉన్నాయి' అని ఆయన అన్నారు.

## మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి : అమిత్ షా నివాళి



న్యూఢిల్లీ : భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆయనకు నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని లోతైన అవగాహన చేసుకున్న వ్యక్తిగా, దశాబ్దాల ప్రజాసేవతో భారతదేశ పాలనపై చెరగని ముద్ర వేసిన రాజనీతిజ్ఞుడిగా ప్రణబ్‌ముఖర్జీని అమిత్‌షా కొనియాడారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నేడు మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ జయంతి. ఈయన ప్రజాసేవకు అంకితమైన నాయకుడు. ముఖర్జీ జీకి రాజ్యాంగం పట్ల ఉన్న లోతైన అవగాహన ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన పదవీకాలాన్ని నిర్వచించింది. ఆయన జీవితం, రచనలు, మన ప్రజాస్వామ్య ప్రయాణానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయి' అని అమిత్ షా ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, మాజీ రాష్ట్రపతి, భారతరత్న ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా వినయపూర్వకంగా నివాళి అర్పిస్తున్నాను. ఆయన దార్శనికత, నిరాడంబరత, దేశ ప్రయోజనాల పట్ల ఆయనకున్న అంకిత భావం భారత ప్రజాస్వామ్యానికి అమూల్యమైన ఆస్తి అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. ప్రణబ్‌ముఖర్జీ భారత 13వ రాష్ట్రపతిగా ఉన్నారు. ఆయన 2012 నుంచి 2017 వరకు రాష్ట్రతి పదవిలో ఉన్నారు. ఆయనకు 2018లో పద్మవిభూషణ్ అవార్డు వరించింది. 1997లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు దక్కింది.

## కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు



మాచర్ల: వైసిపి నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కోర్టులో లొంగిపోయారు. గురువారం ఉదయం పల్నాడు జిల్లా మాచర్లలోని జూనియర్ అదనపు సివిల్ జడ్జి కోర్టుకు వారిద్దరూ వచ్చారు. ఈ ఏడాది మే 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో తెలుగుదేశం పార్టీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి (ఏ6), ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (ఏ7) సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పిన్నెల్లి సోదరులు చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. అనంతరం వారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా నవంబర్ 28న సుప్రీంకోర్టు వీరి ముందస్తు బెయిల్‌ను రద్దు చేసి, రెండు వారాల్లోగా కింది కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియనుండటంతో పిన్నెల్లి సోదరులు కోర్టులో లొంగిపోయారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గురజాల సబ్ డివిజన్ పరిధిలో 144 సెక్షన్ విధించారు. దానితోపాటు పోలీస్ యాక్ట్ 30ను అమలు చేస్తున్నారు. . పలువురు వైసీపీ నాయకులకు ముందస్తు చర్యల్లో భాగంగా హౌజ్ అరెస్టు చేశారు.

## చిమ్మపూడి గ్రామ సర్పంచ్ ఎన్నికలలో సిపిఐ టిడిపి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి కోటేరు నర్సిరెడ్డి విజయం పట్ల హర్షం వ్యక్తం చేసిన వడ్డెబోయిన



ఖమ్మం , నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలంలో జరిగిన మొదటి విడత పంచాయతీ ఎన్నికలలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశానుసారం రాష్ట్ర యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ నాయకత్వంలో చిమ్మపూడి గ్రామంలో గ్రామ సర్పంచ్ గా పోటీ చేసిన కోటేరు నర్సిరెడ్డి గెలుపు కొరకు రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన సారథ్యంలో ప్రచారం నిర్వహించి నర్సిరెడ్డి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ గ్రామ పెద్దలకు, ప్రజలకు పార్టీ నాయకులకు కార్యకర్తలకు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ



మహిళా నాయకురాలు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రతిభా రెడ్డి, మలీద్ మనీష్, 25వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పూర్ణ, నాగిశెట్టి రాధాకృష్ణ, నగర బీసీ సెల్ నాయకులు బండారు శ్రీను, కాంగ్రెస్ నాయకులు రాకోండే కృష్ణ, డివిజన్ ప్రముఖులు నోముల శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్, అనిల్, నారాయణ, రావూరి సైదబాబు, సిహె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# టెక్ దిగ్గజాల పెట్టుబడులజోరు..

### లిస్టులో మైక్రోసాఫ్ట్ నుంచి ఇంటెల్ వరకు బడా సంస్థలు
### దేశీయంగా సాంకేతిక రంగానికి దన్ను
### లక్షల కొద్దీ యువతకు ఉద్యోగావకాశాలు



సాంకేతిక ఆవిష్కరణలకు భారత్ మెగా హబ్‌గా మారే దిశగా చురుగ్గా అడుగులు పడుతున్నాయి. అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి ఇంటెల్ వరకు పలు అగ్రగామి సంస్థలు వరుస కడుతున్నాయి. దేశీయంగా డేటా సెంటర్లు, ఏఐ ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభించడంతో పాటు లక్షల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు కూడా అవకాశాలు పెరుగుతున్నాయి.


న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. నాలుగేళ్ల వ్యవధిలో క్లౌడ్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాల కల్పనపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నారు. ఆసియాలో మైక్రోసాఫ్ట్ ఇంత భారీగా ఇన్వెస్ట్ చేయడం ఇదే ప్రథమం. భారత్ సాంకేతిక సామర్థ్యాలపై కంపెనీకి గల నమ్మకానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక చిప్ దిగ్గజం ఇంటెల్ కూడా భారత్ సెమీకండక్టర్ల లక్ష్యాల సాధనకు మద్దతుగా నిల్చేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం టాటా ఎలక్ట్రానిక్స్‌తో జట్టు కట్టింది. కంపెనీ సీఈవో లిప్%-%బు టాన్ ప్రధాని మోదీతో కూడా సమావేశమయ్యారు. అటు మరో అగ్రగామి సంస్థ అమెజాన్ సైతం భారత్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. ఏఐ, ఎగుమతులు, ఉద్యోగాల కల్పనపై 35 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఇక్కడ అదనంగా పది లక్షలకుపైగా ఉద్యోగావకాశాలను కల్పించాలనే ప్రణాళికల్లో ఉంది. భారత్ నుంచి 80 బిలియన్ డాలర్ల ఈ%-%కామర్స్ ఎగుమతులను లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇక సెర్చ్ దిగ్గజం గూగుల్ .. వైజాగ్‌లో డేటా సెంటర్‌పై 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తోంది. ఓపెన్‌ఏఐ కూడా భారత్‌లో డేటా హబ్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది.

### రియల్టీకి కూడా ఊతం..

దేశవ్యాప్తంగా డేటా సెంటర్లను నిర్మించడంపై పెద్ద సంస్థలు ఆసక్తిగా ఉన్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగానికి కూడా ఊతం లభించనుంది. డేటా సెంటర్ల రాకతో నిర్మాణ, రిటైల్, నిర్వహణ విభాగాల్లో పెద్ద సంఖ్యలో పరోక్ష ఉద్యోగాలకు ఊతం లభించనుంది. వైజాగ్‌లో గూగుల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌తో 1,00,000 పైగా ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అంచనా. కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ అధ్యయనం ప్రకారం డేటా సెంటర్లతో వచ్చే ఒక్క ప్రత్యక్ష ఉద్యోగంతో ఆరు రెట్లు పరోక్ష ఉద్యోగాల కల్పన జరిగే అవకాశం ఉంది. ఏఐ డేటా సెంటర్ బూమ్‌తో ఇంజినీర్లు, ఐటీ నిపుణులు, నిర్మాణ రంగ వర్కర్లు, రిటైల్ తదితర పరి శ్రమలలో మరింత ఉద్యోగ కల్పన జరగనుంది.

# లాగ్ ఔట్ అంటే 'లాగ్ ఔటే'!

### పని గంటల తర్వాత 'నో ఆఫీస్ కాల్స్'
### కాల్స్ తిరస్కరించే హక్కు ఉద్యోగులకు
### క్రమశిక్షణ చర్యలు తీసుకునే వీల్లేదు
### నిబంధన ఉల్లంఘిస్తే కంపెనీకి జరిమానా
### లోక్‌సభ ముందుకొచ్చిన రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు ప్రత్యేకతలు ఇవే



రిమోట్, హైబ్రీడ్ వర్క్, వర్క్ ఫ్రమ్ ఆఫీస్.. విధానం ఏదైనా ఈ డిజిటల్ యుగంలో ఒకవైపు పనిభారం మరోవైపు కెరీర్‌లో పరుగు. వెరసి ఉద్యోగులు విశ్రాంతి కరువై అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. తీవ్ర పని ఒత్తిడితో కొందరు 'కఠిన నిర్ణయాలూ' తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ కల్చర్ వచ్చాక ఉద్యోగుల పనితీరు మారింది. గంటలకొద్దీ కంప్యూటర్ల ముందు కూర్చోవడం ఉద్యోగుల వంతు అవుతోంది. ఇదంతా ఒక ఎత్తైతే.. పని గంటలు ముగిశాక కూడా ఆఫీస్ నుంచి ఫోన్, వీడియో కాల్స్, మెయిల్స్, సందేశాలకు స్పందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ స్పందించకపోతే ఎక్కడ వేటుపడుతుందోనన్న ఆందోళన ఉద్యోగులును వెంటాడుతోంది. దీనికితోడు వారానికి 90 గంటల పని ఉండాలంటూ ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ ఈ ఏడాది ప్రారంభంలో చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, ఓలా భవీశ్ అగర్వాల్ సైతం ఇదే రీతిన స్పందించడంతో పని గంటల విషయంలో భారత్‌లో కార్పొరేట్ కంపెనీల వర్క్‌ప్లేస్ కల్చర్‌కు వారి వ్యాఖ్యలు ప్రతిబింబం అంటూ పెద్ద దుమారమే రేగింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై తీవ్ర చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో 'రైట్ టు డిస్‌కనెక్ట్' బిల్లు తెరపైకి వచ్చింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఇటీవల లోక్‌సభలో రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు-2025ను ప్రవేశపెట్టారు. అధికారిక పని గంటలు ముగిశాక.. సెలవు దినాల్లో పని సంబంధిత కాల్స్, సందేశాలు, ఈ-మెయిల్స్, వీడియో కాల్స్‌ను ఉద్యోగులు తిరస్కరించేలా చట్టపరమైన హక్కును కల్పించాలని కోరుతూ ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

### నిరంతరం అందుబాటులో..

నేటి డిజిటల్ ప్రపంచంలో అధిక పని కారణంగా తీవ్ర మానసిక, భావోద్వేగ, శారీరక ఒత్తి డిని తగ్గించడం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్యకరమైన పని-జీవిత సమతౌల్యతను ప్రోత్సహించడం 'రైట్ టు డిస్‌కనెక్ట్' లక్ష్యమని సుప్రియా సూలే చెప్పారు. 'ఆధునిక వర్క్ కల్చర్‌లో ఉద్యో గులు నిరంతరం అందుబాటులో ఉండటం సర్వసాధార ణమైంది. స్పందించేందుకు డిజి టల్ సాధ నాలు సౌలభ్యంగానే ఉన్నప్పటికీ కార్మికులు రేయింబవళ్లు ఈ-మెయిల్స్‌ను తనిఖీ చేయ డానికి, సందేశాలకు ప్రతిస్పందించడానికి ఒత్తిడిని అనుభవిస్తున్న సంస్కృతిని కూడా ఈ సాధనాలు సృష్టించాయి' అని సభ దృష్టికి తీసుకెళ్లారు. పని గంటలకు మించి డిజిటలై జేషన్ ద్వారా విధులు నిర్వర్తించినప్పటికీ అదనపు చెల్లింపులు చేయకుండా కంపెనీలు సాగిస్తున్న కార్యకలాపాలను అడ్డుకోవడం కూడా ఈ బిల్లు ఉద్దేశమని ఆమె వివరించారు.

### అమలుపైనే ఆధారం..

కార్పొరేట్ కంపెనీల్లో పనిచేస్తున్న సిబ్బందిలో రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఇది కార్యరూపంలోకి వస్తే వర్క్‌ప్లేస్ కల్చర్ మారడం ఖాయమని వారు భావిస్తున్నారు. ఈ బిల్లు ఉద్యోగుల వ్యక్తిగత సమయాన్ని కాపాడటం, శ్రేయస్సును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ బిల్లు ఉద్దేశం నిజంగా నెరవేరడంపై సందేహం తలెత్తుతోంది. బిల్లు చట్టంగా మారి ఉద్యోగులకు బలమైన రక్షణ కల్పించినా దీర్ఘకాలంగా పాతుకుపోయిన పని సంస్కృతి నిబంధనలను మార్చడానికి ఇది ఒక్కటే సరిపోకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. 'డిస్‌కనెక్ట్ బిల్లు కాగితంపై చాలా బాగుంది. కానీ సంస్థలు అమలు చేసే పని విధానంపై నిజమైన మార్పు ఆధారపడి ఉంటుంది. అవాస్తవిక పనిభారం, సరిహద్దులు లేకపోవడం, పేలవమైన సమయ నిర్వహణ పద్ధతుల వంటి సమస్యలను కంపెనీలు పరిష్కరించకపోతే లొసుగులు రాజ్యమేలతాయి' అని ఓ సైకాలజిస్ట్ వ్యాఖ్యానించారు.

### మూలాన్ని మార్చడం ద్వారా..


రైట్ టు డిస్‌కనెక్ట్‌తో ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. పనివేళల్లో ఉత్సాహంగా ఉండటానికి కష్టపడటం, కఠినమైన గడువులను జయించడానికి ఒత్తిడిని ఎదుర్కోవడం లేదా సిబ్బంది కొరత వంటివి ఉద్యోగులు తరచూ ఎదుర్కొనే సవాళ్లను ఈ బిల్లు పరిష్కరించదని నిపుణులు చెబుతున్నారు. 'చట్టపరమైన నిబంధనలు మాత్రమే కార్యాలయాల్లో పని సంస్కృతిని మార్చలేవు. సమస్య మూలానికి మందు వేయడం ద్వారా ఆరోగ్యకరమైన పని-జీవిత సమతౌల్యత సాధించవచ్చు. అనుకూలమైన, ఆచరణాత్మకమైన, రోజువారీ వాస్తవాలపై ఆధారపడిన వ్యవస్థలు ఉద్యోగులకు అవసరం' అని వారు స్పష్టం చేస్తున్నారు. నిబంధనలను అర్థవంతంగా రూపొందించడానికి ఉద్యోగులు, సంస్థలు కలిసి పనిచేయాలన్నది నిపుణుల భావన.

### బిల్లులో ఏముందంటే..

అధికారిక పని గంటల తరువాత, సెలవు రోజుల్లో ఆఫీస్ ఫోన్‌కాల్స్, వీడియోకాల్స్, మెయిల్స్, సందేశాలను ఉద్యోగులు తిరస్కరించవచ్చు. స్పందించని సిబ్బందిపై కంపెనీ ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. కవేళ నిబంధనలను కంపెనీ ఉల్లంఘిస్తే.. మొత్తం ఉద్యోగుల వేతనంలో ఒక శాతానికి సమానమైన మొత్తాన్ని జరిమానాగా విధిస్తారు. సిబ్బంది హక్కుల పరిరక్షణకు ప్రత్యేక సంక్షేమ సంస్థ ఏర్పాటు. అధికారిక సమయానికి మించి పనిచేసే ఉద్యోగులకు ప్రామాణిక వేతనాల ప్రకారం ఓవర్ టైం చెల్లింపుతో పరిహారం. పనివేళల తరువాత ఉద్యోగులను సంప్రదించడానికి పరస్పరం అంగీకరించిన నిబంధనలను రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు.

# మనకూ సొంత స్పేస్ స్టేషన్

### 2035 నాటికి సాకారం
### ఐదు రాకెట్లతో అంతరిక్షంలోకి విడి భాగాలు
### 2028లో మొదటి మాడ్యూల్ ప్రయోగం
### 2026 ఫిబ్రవరిలో గగన్‌యాన్ తొలి ప్రయోగం
### నాలుగు మానవ రహిత పరీక్షల అనంతరం మానవ సహిత ప్రయోగం
### సెమీ కండక్టర్లలో స్వయం సమృద్ధి దిశగా భారత్ అడుగులు



గుజరాత్ : 'సొంత అంతరిక్ష కేంద్రాలు కలిగిన దేశాల సరసన త్వరలో భారత్ నిలవనుంది. 2028లో భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణం షురూ అవ్వనుంది' అని ఇస్రోలో భాగమైన అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్‌ఏసీ) డైరెక్టర్ నీలేశ్ ఎం.దేశాయ్ తెలిపారు. స్వదేశీ అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి ఐదు రాకెట్ల ద్వారా అంతరిక్షంలోకి విడి భాగాలు పంపాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా 2028లో తొలి రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. 2035 నాటికి విడి భాగాలన్నింటినీ అంతరిక్షంలోకి చేర్చి ఇంటిగ్రేషన్ పూర్తి చేస్తామన్నారు. దీంతో భవిష్యత్తులో రోదసీ యాత్ర చేసే వ్యోమగాములు స్వదేశీ అంతరిక్ష కేంద్రంలో దిగి చంద్రుడి మీదకు వెళ్తారని చెప్పారు. ఎస్‌ఏసీ పనితీరు గురించి నీలేశ్ ఎం.దేశాయ్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### 2027లో మానవ సహిత ప్రయోగం

మానవ రహిత అంతరిక్ష ప్రయోగం దిశగా ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) వేగంగా అడుగులు వేస్తోంది. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంగా తొలుత నాలుగు మానవ రహిత ప్రయోగాలు చేయాలని ఇస్రో నిర్ణయించింది. 2026 ఫిబ్రవరిలో తొలి ప్రయోగం చేపట్టబోతున్నాం. 2026లోనే మరో రెండు, 2027లో చివరి ప్రయోగం పూర్తి చేస్తాం. అదే ఏడాది ఆఖరులో మానవ సహిత ప్రయోగం పూర్తి చేస్తాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయిన సందర్భంగా 2022లోనే గగన్‌యాన్ పూర్తి చేయాల్సి ఉంది. కరోనా, ఇతర సాంకేతిక కారణాలతో ప్రయోగం వాయిదా పడింది. గగన్‌యాన్ యాత్రకు వ్యోమగాములుగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుంచి నలుగురు కెప్టెన్‌లను ఎంపిక చేశాం. వీరిలో ఒకరైన శుభాన్షు శుక్ల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి తిరిగి వచ్చారు. మిగిలిన ముగ్గురిలో ఒకరు తిరిగి ఎయిర్ ఫోర్స్‌కు వెళ్లగా, ఇద్దరు శిక్షణలో కొనసాగుతున్నారు. 2027లో గగన్‌యాన్‌లో ఎంత మంది వ్యోమగాములు రోదసీ యాత్ర చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇద్దరు వ్యోమగాములు ఉంటే మంచిదని భావిస్తున్నాం. వ్యోమగాములు సురక్షితంగా అంతరిక్ష యాత్ర చేసి, తిరిగి వచ్చేందుకు వీలుగా వాహక నౌకను తీర్చి దిద్దుతున్నాం. డీఆర్‌డీఏ, ఇతర స్వతంత్ర సంస్థలు నౌకను సర్టిఫై చేస్తాయి.

### స్వదేశీ సాంకేతికతతో సెమీ కండక్టర్ల తయారీ

సెమీ కండక్టర్లలో స్వయం సమృద్ధి సాధనే లక్ష్యంగా భారత్ అడుగులు వేస్తోంది. ఇస్రో కార్యకలాపాలకు సెమీ కండక్టర్లు కీలకమైనవి. ఇస్రో అవసరాల కోసం సెమీ కండక్టర్లు బయట నుంచి కొనే పని లేకుండా చేస్తున్నాం. అంతే కాకుండా బయటి సంస్థల అవసరాలకూ సెమీ కండక్టర్లు సరఫరా చేస్తున్నాం. ఎస్‌ఏసీలో దేశంలోనే మొదటి సారిగా పూర్తి స్వదేశీ సాంకేతికతతో సెమీ కండక్టర్లు తయారు చేస్తున్నాం. ఈ సాంకేతికను వాడుకోవడానికి ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తున్నాయి. సెమీ కండక్టర్ల విషయంలో ఎంతో చిన్న దేశమైన తైవాన్‌పై ప్రపంచం మొత్తం ఆధారపడి ఉంది.

### ఎస్‌ఏసీ ఎంతో విభిన్నం

ఇస్రోలో భాగమైన మిగిలిన సంస్థలతో పోలిస్తే ఎస్‌ఏసీ ఎంతో విభిన్నమైంది. ఉపగ్రహ పేలోడ్‌లను ప్రజలు, ప్రభుత్వం, సమాజానికి ఉపయోగకరమైన కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, నావిగేషన్, దేశ రక్షణ, జాతీయ ప్రయోజనం కోసం అభివృద్ధి చేయడంలో ఎస్‌ఏసీకి ప్రత్యేకత ఉంది. దేశంలో వాతావరణాన్ని అంచనా వేయడంలో కీలకంగా వ్యవహరిస్తోంది. అంతరిక్షంలోని శాటిలైట్ వ్యవస్థ ద్వారా 15 రోజుల ముందే వాతావరణ పరిస్థితులను అంచనా వేసి, సమాచారాన్ని ఐఎండీకి చేరవేస్తున్నాం. దీంతో తుపానులు, ఇతర ప్రకృతి విపత్తుల పట్ల ప్రభుత్వాలు అప్రమత్తం అవుతాయి.

# ప్రభాస్ సినిమాల్లో స్పిరిట్ లెక్క వేరంతే..!








రెబల్ స్టార్ ప్రభాస్ లైన్ లో ఉన్న సినిమాలు ఫ్యాన్స్ కి గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. నెక్స్ట్ సంక్రాంతికి రాజా సాబ్ సినిమాతో రాబోతున్న ప్రభాస్ అదే ఏడాది ఫౌజీ సినిమాతో కూడా సర్ ప్రైజ్ చేయనున్నాడు. హను రాఘవపూడి ఫౌజీ సినిమాను మరో అద్భుతమైన కథతో వస్తున్నారని తెలుస్తుంది. సినిమాలో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తుండగా ప్రభాస్, ఇమాన్వి లవ్ స్టోరీ ఆడియన్స్ కి ట్రీట్ టు వాచ్ అనేలా ఉంటుందట. అంతేకాదు సినిమాలో యాక్షన్ సీన్స్ కూడా వార్ సీక్వెన్స్ ని తలపించేలా నెక్స్ట్ లెవెల్ ఉంటాయని టాక్. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా ప్రభాస్.. ఐతే ఈ సినిమా తర్వాత సందీప్ వంగాతో స్పిరిట్ చేస్తున్నాడు ప్రభాస్. ఈ సినిమాను కూడా సందీప్ తన మార్క్ యాక్షన్ ఎంటర్టైనర్ విత్ ఫుల్ ఆఫ్ ఎమోషన్ యాంగిల్ లో ప్లాన్ చేస్తున్నాడు. సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా నటిస్తున్నాడు. ఐతే ప్రభాస్ క్యాలో ఉన్న అన్ని సినిమాల్లో రెబల్ ఫ్యాన్స్ కి సూపర్ ఎగ్జైటెడ్ గా అనిపించే సినిమా ఏదైనా ఉంది అంటే అది సందీప్ వంగా చేస్తున్న స్పిరిట్ మాత్రమే. ఎందుకంటే సందీప్ వంగ సినిమాల మీద ఉన్న కాన్ఫిడెన్స్ అలాంటిది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ ఈ సినిమాలతో సందీప్ వంగ అంటే ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు. విజయ్ దేవరకొండ ని అర్జున్ రెడ్డిగా చూపించినప్పుడే డైరెక్టర్ సత్తా ఏంటో ప్రూవ్ అయ్యింది. ఇక యానిమల్ తో బాలీవుడ్ ని సైతం షేక్ ఆడించాడు సందీప్. అలాంటి డైరెక్టర్ కి బాహుబలి ప్రభాస్ దొరకడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. అందుకే సందీప్ వంగ స్పిరిట్ లో ప్రభాస్ ఎలా ఉంటాడు.. ఎలాంటి విధ్వంసం సృష్టిస్తాడు అన్న దాని మీద దృష్టి పెట్టారు. రాజా సాబ్, ఫౌజీ నెక్స్ట్ ఇయర్ ఫ్యాన్స్ కి ట్రీట్.. ప్రభాస్ సందీప్ వంగ ఆల్రెడీ తమ డ్యూటీ ఎక్కేశారు. ఈమధ్యనే సెట్స్ మీదకు వెళ్లిన స్పిరిట్ నుంచి ఒక లీక్ వీడియో కూడా వైరల్ అయ్యింది. సినిమాను ఎట్టి పరిస్థితుల్లో 2027 రిలీజ్ చేసేలా సందీప్ ప్లానింగ్ ఉందట. సో రాజా సాబ్, ఫౌజీ నెక్స్ట్ ఇయర్ ఫ్యాన్స్ కి ట్రీట్ ఇస్తే 2027 లో రెబల్ ఫ్యాన్స్ కి స్పిరిట్ హంగామా ఉండబోతుంది. అసలే స్పిరిట్ సౌండ్ అనౌన్స్ మెంట్ తో ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ అనే ట్యాగ్ వేశాడు. మరి ఆ ట్యాగ్ కి న్యాయం చేసేలా సినిమా ఉంటే మాత్రం రికార్డుల లెక్క నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని చెప్పొచ్చు. ఇవే కాదు సలార్ 2, కల్కి 2 సినిమాలు కూడా ప్రభాస్ పూర్తి చేయాల్సి ఉంది. ఈ సినిమాలు పూర్తి చేసిన తర్వాతే ప్రభాస్ కొత్త సినిమా సైన్ చేసే ఛాన్స్ లు ఉన్నాయి.

# సమంత స్టన్నింగ్ లుక్‌కి ఫ్యాషన్ ప్రపంచం ఫిదా!







టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత తాజాగా ఓ స్టన్నింగ్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. జీక్యూ పవర్ లిస్ట్ 2025 ఈవెంట్‌కు హాజరైన సందర్భంలో ఆమె ధరించిన నెట్ డిజైన్ హై స్లిట్ గౌన్ లుక్‌కి నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. బ్లాక్ కాంబినేషన్‌లో మెరిసిన ఈ డ్రెస్‌కు మ్యాచింగ్ మేకప్, స్ట్రెయిట్ హెయిర్ స్టైల్ తో తన యాటిట్యూడ్‌ను మరింతగా హైలైట్ చేసింది. ఈ ఫొటోషూట్‌లో సమంత అటిట్యూడ్, కాన్ఫిడెన్స్, స్టైల్ అన్నీ కలిపి ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌కి సూట్ అయ్యేలా ఉన్నాయి. ఆమె ఈ లుక్‌లో కేవలం గ్లామర్‌తోనే కాదు, తనలో ఉన్న స్ట్రాంగ్ వైబ్ ని చూపించగలిగింది. నెట్ మెష్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రెస్సుకు స్లిట్ కట్ ఆకర్షణీయంగా ఉండి, సామంత యొక్క బోల్డ్ లుక్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు "ఈ లుక్‌తోనే మళ్లీ ట్రెండ్ లోకి వచ్చేసింది" అంటూ కామెంట్లు పెడుతున్నారు. కెరీర్ పరంగా చూస్తే... తాజాగా ఆమె 'బంగారం' అనే సినిమాలో నటిస్తోంది. ఇది ఆమె కామ్‌బ్యాక్ మూవీగా ట్రీట్ అవుతోంది. అంతేకాదు, ఓ ఇంటర్నేషనల్ వెబ్ సిరీస్ అయిన 'రక్త బ్రహ్మాండ'లో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవల మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడిన సామ్ కొంతకాలం విరామం తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టింది. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో భాగంగా వ్యాయామం, ధ్యానం, వైద్య చికిత్సలను పక్కాగా అనుసరిస్తూ, ఇప్పుడు మళ్లీ షూటింగ్‌కి సిద్ధమవుతోంది. "ఆరోగ్యం కోల్పోయినప్పుడే మన అసలు బలాన్ని గుర్తించగలం" అంటూ గతంలో చెప్పిన సామ్ ఇప్పుడు మళ్లీ తన పని పట్ల కమిట్‌మెంట్ చూపిస్తూ, అన్ని ఫ్రంట్‌లలో ముందుకు వెళ్తోంది. ఈ తాజా లుక్‌ద్వారా ఆమె ఇప్పటికీ ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచినట్టు మరోసారి ప్రూవ్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలు ఇప్పటికే లక్షల్లో లైక్స్ సంపాదించాయి. కామెంట్లలో అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్, గ్రేస్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

# రూటు మార్చిన మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా....






తమన్నా భాటియా. ముందు చిన్న హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మిల్కీ బ్యూటీ చాలా తక్కువ టైమ్ లోనే స్టార్ హీరోలందరి సరసన జత కట్టి స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగారు. అయితే గత కొన్నాళ్లుగా తమన్నా బాలీవుడ్ లో బాగా బిజీ అయిపోయిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ బిగ్ బడ్జెట్ సినిమాల్లో ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ అలరిస్తున్నారు తమన్నా. బాలీవుడ్ బయోపిక్ లో తమన్నా గత కొన్నాళు ల్గా తమన్నాను ఎక్కువగా ఐటెం సాంగ్స్ లోనే ఆడియన్స్ చూస్తూ వచ్చారు. అలాంటి తమన్నా ఇప్పుడు తన రూట్ ను మార్చి ఓ బాలీవుడ్ బయోపిక్ లో కీలక పాత్ర చేస్తున్నారు. లెజండరీ డైరెక్టర్ వి. శాంతారామ్ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్ లో ఓ సినిమా తెరకెక్కుతుండగా అందులో శాంతారామ్ రెండో భార్య, ఒకప్పటి నటి అయిన జయశ్రీ గడ్కర్ పాత్రలో తమన్నా కనిపించనున్నారు. వింటేజ్ వైబ్ ను తీసుకొచ్చిన మిల్కీ బ్యూటీ రీసెంట్ గా మేకర్స్ ఆ సినిమా నుంచి తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేయగా, అందులో తమన్నా వింటేజ్ సెటప్ లో చీర కట్టులో ఎంతో అందంగా మెరిశారు. ఇంకా చెప్పాలంటే తమన్నా ఆ పోస్టర్ లో ఒక వింటేజ్ నటి యొక్క వైబ్ ను తీసుకొచ్చారు. కెరీర్లో ఇప్పటివరకు ఎక్కువగా గ్లామరస్ రోల్స్ చేసిన తమన్నా రీసెంట్ గా ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ వచ్చి, ఇప్పుడు సడెన్ గా ఓ బయోపిక్ లో కీలక పాత్ర కు ఎంపికవడం విశేషమనే చెప్పాలి. మరి రెగ్యులర్ గా తమన్నాను గ్లామరస్ లుక్స్ లో చూడటం అలవాటు చేసుకున్న ఆడియన్స్ ను తమన్నా ఈ సినిమాతో ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. అయితే నటిగా తమన్నా ఇప్పటివరకు ఎప్పుడూ ఫెయిలైంది లేదు. తన వద్దకు వచ్చిన పాత్రకు 100% న్యాయం చేసే తమన్నా మరి ఈ బయోపిక్ తో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి. అభిజీత్ శిరీష్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.




# భాగ్యం ఇదేం మాస్ రాంపేజ్ బాబోయ్..!



టాలీవుడ్ లో కాస్త టాలెంట్ ఉన్న హీరోయిన్ వస్తె చాలు ఆమెకు వరుస అవకాశాలు ఇస్తూ ఎంకరేజ్ చేస్తారు. అయితే ఇది అందరికీ జరుగుతుందా అంటే అలా కాదు. కొందరికి అది కూడా లక్ ఉన్న వారికి మాత్రమే అలా జరుగుతుంది. ప్రస్తుతం అలాంటి లక్కీ గాళ్ గా క్రేజీ ఛాన్స్ అందుకుంటుంది భాగ్య శ్రీ బోర్స్. మాస్ మహారాజ్ రవితేజతో మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ. హరీష్ శంకర్ ఇంట్రడ్యూస్ చేసే హీరోయిన్స్ కి అదేంటో బాగా కలిసి వస్తుంది. ఈ క్రమంలో మిస్టర్ బచ్చన్ ఫ్లాప్ అయినా కూడా భాగ్యానికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం అమ్మడు కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా, కాంతా సినిమాలు చేస్తుంది. ఈ సినిమాల్లో ఏ ఒక్కటి బ్లాక్ బస్టర్ పడ్డా అమ్మడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఇది చాలదు అన్నట్టుగా మరికొన్ని సినిమాలు వచ్చి యాడ్ అవుతున్నాయి. భాగ్య శ్రీ ఖాతాలో లేటెస్ట్ గా అక్కినేని అఖిల్ లెనిన్ కూడా వచ్చి చేరిందని టాక్. శ్రీలీల చేయాల్సిన ఆ సినిమా కాస్త ఆమెకు డేట్స్ అడ్జెస్ట్ అవ్వట్లేదని ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ కాగా ఆ ఛాన్స్ భాగ్య శ్రీ కొట్టేసింది. ఆల్రెడీ సితార బ్యానర్ లో కింగ్ డం చేస్తున్న భాగ్య శ్రీ పనిలో పనిగా మరో ఆఫర్ అందుకుంది. తెలుగులో ఒకే ఒక్క సినిమా అది కూడా ఫ్లాప్ అయిన కూడా భాగ్య శ్రీకి బంపర్ ఆఫర్లు.. చెప్పాలంటే ఒక దానికి మించి మరొక ఆఫర్ అన్నట్టుగా వస్తున్నాయి. అఖిల్ లెనిన్ ఛాన్స్ అయితే ఆమెకు నిజంగానే లక్కీ అనిపించేలా చేసింది. భాగ్య శ్రీ పర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. మిస్టర్ బచ్చన్ లో తన గ్లామర్ ట్రీట్ తో ఆడియన్స్ ని అలరించింది. అంతేకాదు ఆఫ్ స్క్రీన్ కూడా చాలా యాక్టివ్ గా కనిపించింది. అదే అమ్మడికి అవకాశాలు తెచ్చేలా చేస్తుంది. కింగ్ డం సినిమా నుంచి వచ్చిన సాంగ్ తో యూత్ ఆడియన్స్ కి దగ్గరైంది భాగ్య శ్రీ. చూస్తుంటే అమ్మడు టాలీవుడ్ లో కొన్నాళ్లు తన హవా కొనసాగించేలా ఉందనిపిస్తుంది. ఇక రిలీజ్ ల విషయానికి వస్తే భాగ్య శ్రీ నటించిన కింగ్ డమ్ నెక్స్ట్ మంత్ రిలీజ్ అవుతుంది. ఆంధ్రా కింగ్ తాలూకా కూడా త్వరలో రిలీజ్ అవబోతుంది. ఈ రెండు సినిమాలు హిట్లు పడితే మాత్రం భాగ్య శ్రీ రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

# వారణాసి: కరగాల్సిందే, కొత్తగా మెరవాల్సిందే..






టాలీవుడ్ లో రాజమౌళితో సినిమా చేయాలని కోరుకోని హీరో ఉండరు. ఆయనతో సినిమా అంటే గ్లోబల్ ఇమేజ్ గ్యారెంటీ. కానీ ఆ క్రేజ్ వెనుక హీరోలు పడే కష్టం అంతా ఇంతా కాదు. అవుట్ పుట్ కోసం నటీనటులను పిండేస్తారని, పర్ఫెక్షన్ కోసం చుక్కలు చూపిస్తారని రాజమౌళికి ఇండస్ట్రీలో ఒక పేరుంది. గతంలో ప్రభాస్, ఎన్టీఆర్, చరణ్ వంటి హీరోలు కూడా జక్కన్న పెట్టే పని గురించి సరదాగా భయపడుతూనే చెప్పారు. ఇప్పుడు ఆ వంతు సూపర్ స్టార్ మహేష్ బాబుకి వచ్చింది. వారణాసి సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం వస్తున్న వార్తలు చూస్తుంటే మహేష్ బాబు వారణాసి సినిమా కోసం తన కెరీర్ లోనే ఎప్పుడూ పడనంత కష్టపడుతున్నట్లు అర్థమవుతోంది. దానికి కారణం సినిమాలో ఉన్న పాత్రలే. బయట ప్రచారం జరుగుతున్నట్లుగా ఈ సినిమాలో మహేష్ బాబు ఏకంగా 5 విభిన్న అవతారాల్లో కనిపించబోతున్నారట. రాముడు, రుద్ర పాత్రలతో పాటు మరో మూడు గెటప్స్ కూడా ఉన్నాయని ఇన్ సైడ్ టాక్. అసలు ఇన్నేళ్ల కెరీర్ లో మహేష్ బాబు ఎప్పుడూ ద్విపాత్రాభినయం కూడా చేయలేదు. అలాంటిది ఇప్పుడు ఏకంగా 5 పాత్రలు అంటే మాటలు కాదు. ఒక్కో పాత్రకు ఒక్కో బాడీ లాంగ్వేజ్, వాయిస్ మాడ్యులేషన్ చూపించాలి. ఒక్క పాత్ర ఉంటేనే వంద టేకులు తీసుకునే రాజమౌళి, ఇప్పుడు 5 పాత్రలంటే మహేష్ ను ఇంకెంత కష్టపెడతారో అని ఫ్యాన్స్ సరదాగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ఈ 5 గెటప్స్ కోసం మహేష్ ఫిజికల్ గా కూడా చాలా మారాల్సి వస్తోంది. ఇప్పటికే రుద్ర లుక్ కోసం జుట్టు పెంచి, కండలు పెంచి కొత్తగా తయారయ్యారు. రాముడి ఎపిసోడ్ షూటింగ్ కూడా పూర్తయ్యిందని అంటున్నారు. మిగిలిన పాత్రల కోసం ఇంకెన్ని మేకోవర్లు చేయాలో, ఇంకెంత కసరత్తు చేయాలో ఆ జక్కన్నకే తెలియాలి. మహేష్ బాబుకి ఇది నిజంగా ఒక బిగ్గెస్ట్ ఛాలెంజ్ అనే చెప్పాలి. అయితే ఆ మాత్రం కష్టం లేకపోతే కిక్ ఉండదు కదా. దాదాపు వెయ్యి కోట్ల బడ్జెట్ తో రూపొందుతున్న గ్లోబల్ ప్రాజెక్ట్ ఇది. ప్రపంచం మొత్తం ఈ సినిమా వైపు చూస్తోంది. అందుకే రాజమౌళి ఎక్కడా రాజీ పడటం లేదు, మహేష్ కూడా దర్శకుడు చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఆ ఐదు గెటప్స్ లో వేరియేషన్స్ చూపించడానికి నిద్రాహారాలు మాని పని చేస్తున్నారు. ఏదేమైనా జక్కన్న చేతిలో పడ్డాక ఎంతటి స్టార్ హీరో అయినా కరగాల్సిందే, కొత్తగా మెరవాల్సిందే. ఆ పని రాక్షసుడు పెడుతున్న ఈ కష్టం రేపు స్క్రీన్ మీద అద్భుతంగా మారుతుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఈ 5 అవతారాల వెనుక ఉన్న అసలు మ్యాజిక్ ఏంటో తెలియాలంటే మాత్రం కొన్నాళ్లు ఆగాల్సిందే.



# సవాళ్లపై భారత్ నజర్ వేయాల్సిందే!




అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు భారతదేశంలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపడం దేశ డిజిటల్ విప్లవంలో ఒక కీలక ఘట్టం. ఇంటర్నెట్, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధస్సు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ-కామర్స్ వంటి ఆధునిక డిజిటల్ సేవలకు డేటా సెంటర్లు మూలస్తంభాలు. భారతదేశంలో ప్రస్తుతం డేటా సెంటర్ల సంఖ్య ప్రపంచంలోని వాటితో పోలిస్తే అతి తక్కువగా (కేవలం 3% వాటా) ఉన్నప్పటికీ 2030 నాటికి వీటి సామర్థ్యం పెరుగుతుందని అంచనా. అయితే, ఈ వేగవంతమైన వృద్ధి కొన్ని కీలకమైన పర్యావరణ, మౌలిక సదుపాయాల సవాళ్లను కూడా ముందుకు తెస్తోంది.

### డేటా సెంటర్ల ఏర్పాటుతో లాభాలు

డేటా సెంటర్ల కోసం భారత్‌లోకి దాదాపు రూ.2.6 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తుంది. మల్టీనేషనల్ కంపెనీల నుంచి విదేశీ పెట్టుబడులు పెరుగుతాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో డిమాండ్ పెరిగి అనుబంధ రంగాలకు లబ్ధి చేకూరుతుంది. ఐటీ, నెట్‌వర్క్ నిర్వహణ, భద్రత, నిర్వహణ వంటి రంగాల్లో ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయి. సప్లయ్ చైన్, రవాణా, హోటల్ వంటి సేవల రంగాలలో పరోక్ష ఉద్యోగాలు వస్తాయి. డేటా సెంటర్ల అవసరాల కోసం ఫైబర్ కనెక్టివిటీ, విద్యుత్ సరఫరా వ్యవస్థలు మెరుగుపడతాయి. ఇది స్థానిక స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలకు మెరుగైన డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించి, టెక్నాలజీ రంగంలో పురోగతికి దోహదపడుతుంది.డేటా స్థానికీకరణ ద్వారా భారతీయ డేటా భద్రత మెరుగుపడుతుంది.

### సవాళ్లు లేవా..?

డేటా సెంటర్ల కోసం విద్యుత్, నీరు చాలా అవసరం. భారతదేశంలో ఇప్పటికే ఈ వనరుల లభ్యత, వినియోగంపై ఆందోళనలు ఉన్నాయి. డేటా సెంటర్లలో సర్వర్‌లు నిరంతరం పనిచేయడం వల్ల భారీగా వేడిని ఉత్పత్తి చేస్తాయి. దీన్ని చల్లబరచడానికి, సర్వర్‌లకు శక్తిని అందించడానికి అధిక విద్యుత్ అవసరం. భారతదేశం అధికంగా థర్మల్ విద్యుత్‌పై ఆధారపడుతున్నందున డేటా సెంటర్ల ఏర్పాటుతో కార్బన్ ఉద్గారాలు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉంది. పెద్ద డేటా సెంటర్‌లు పట్టణ విద్యుత్ సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి పెంచి విద్యుత్ కొరతకు దారి తీయవచ్చు. అయితే గూగుల్ వంటి కంపెనీలు తమ సెంటర్లకు పునరుత్పాదక శక్తి వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకోవడం సానుకూల అంశం. అయితే, మొత్తం డిమాండ్‌ను థర్మల్ విద్యుత్ నుంచి పునరుత్పాదక ఇంధనానికి మార్చడం తక్షణ సవాలు. దీనికి సంబంధించి మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా ప్రభుత్వాలు, కంపెనీలు చర్యలు తీసుకోవాలి.

### నీటి నిర్వహణ

సర్వర్ల వేడిని తగ్గించడానికి శీతలీకరణ ప్రక్రియకు లక్షలాది లీటర్ల నీరు అవసరం. గూగుల్ వంటి సంస్థలు వార్షికంగా బిలియన్ల గ్యాలన్ల నీటిని వినియోగిస్తున్నట్లు అంచనాలున్నాయి. ఇప్పటికే నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో డేటా సెంటర్ల ఏర్పాటు వల్ల స్థానిక ప్రజలకు, వ్యవసాయానికి నీటి లభ్యతపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది. కంపెనీల నుంచి నీటి వినియోగంపై పారదర్శకత లేకపోవడం, నియంత్రణ సంస్థల నుంచి సరైన పర్యవేక్షణ లేకపోవడం ఈ సమస్యను మరింత పెంచుతుందని గుర్తుంచుకోవాలి.

### సింగపూర్, అమెరికాలో వ్యతిరేకత

సింగపూర్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నట్లు తెలుస్తుంది. ఈ దేశాల్లో డేటా సెంటర్ల విస్తరణను ప్రజలు, పర్యావరణవేత్తలు పరిమితం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణాలు భారతదేశంలోని సమస్యల తరహాలోనే ఉన్నాయి. అధిక విద్యుత్ వినియోగం కోసం శిలాజ ఇంధనాలపై ఆధారపడినప్పుడు కార్బన్ ఉద్గారాలను పెంచుతుండడం. స్థానిక నీటి వనరులపై ఒత్తిడి పెంచి, ఇతర అవసరాలకు కొరత ఏర్పరచడం.

### అంతా ఆటోమేషన్..


డేటా సెంటర్ల నిర్వహణ ఆటోమేటెడ్‌గా ఉంటుంది. దాంతో ఉద్యోగాలు ఎక్కువగా రాకపోవడం, ఆర్థిక ప్రయోజనం స్థానికులకు తక్కువగా ఉండటంతో ఇప్పటికే ఇవి ఉన్న ప్రాంతాల్లో వ్యతిరేకత నెలకొంటుంది. ఈ పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలించి అందుకు తగిన విధంగా పాలసీను రూపొందించాలి. సాంకేతిక పురోగతికి డేటా సెంటర్లు అవసరమే అయినా, వనరుల స్థిరత్వం, పర్యావరణ భద్రత విషయంలో దీర్ఘకాలిక ప్రణాళిక చాలా అవసరం.

# సిటీ టీమ్ అంటే దేశంలోని అన్ని టీమ్‌లకు హడల్!

**ఆటకు మన వద్ద ఏమాత్రం లేని ఆదరణ**

**ఇక ముందైనా మార్పు వస్తుందా..?**

**ప్రతిభను ప్రోత్సహిస్తూ టోర్నీలో నిర్వహిస్తే సాధ్యమే..**



ఫుట్‌బాల్ దిగ్గజం, ఆల్‌టైమ్ గ్రేట్ లయోనల్ మెస్సీ మన భాగ్యనగరానికి వస్తున్నాడు. ఈ ప్రకటన వచ్చిన నాటి నుంచి అతడి రాకపై పలు రకాలుగా చర్చ.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్జెంటీనా స్టార్ ప్లేయర్ మెస్సీతో ఆడేందుకు సిద్ధమవుతున్నారు. అతడి ఈవెంట్ కోసం భారీ ధరతో టికెట్లున్నా వెనక్కి తగ్గకుండా అతడిని చూసేందుకు అభిమానులు ఎగబడిపోతున్నారు. శనివారం జరిగే ఈ షో కోసం టికెట్లన్నీ అమ్ముడుపోవడంతో ఉప్పల్ స్టేడియం హౌస్‌ఫుల్ కావడం ఖాయం. కానీ మెస్సీ మాయ 3 గంటల్లో ముగిసిపోతుంది. ఆ తర్వాత మన వద్ద అసలైన ఫుట్‌బాల్ ఏమిటో కనిపిస్తుంది. ఒక అసాధారణ ఆటగాడిపై అభిమానం ఉండటం సరే కానీ.. మన వద్ద ఆటకు ఏమాత్రం ఆదరణ ఉందనేది ఆసక్తికరం. మెస్సీ షో కారణంగా ఇక్కడ ముందు ఏదైనా మార్పు కనిపిస్తుందా అనేది చర్చనీయాంశం. ఎస్ఏ రహీమ్, నయీముద్దీన్, తులసీదాస్ బలరామ్, పీటర్ తంగరాజ్, షాహిద్ వసీమ్, మొహమ్మద్ హబీబ్, షబ్బీర్ అలీ, జుల్ఫికర్ అలీ.. ఒకరా, ఇద్దరా ఎంతో మంది హైదరాబాద్ దిగ్గజాలు భారత ఫుట్‌బాల్‌ను సుదీర్ఘ కాలం నడిపించారు. 1950వ, 1960వ దశకాల్లో భారత జట్టు మొత్తం హైదరాబాద్ ఆటగాళ్లతోనే కనిపించేది. మన సిటీ పోలీస్ టీమ్ అంటే దేశంలోని ఏ జట్టుకైనా హడల్. సంతోష్ ట్రోఫీ, డ్యురాండ్ కప్, రోవర్స్ కప్.. టోర్నీ ఏదైనా విజేత హైదరాబాద్ జట్టు మాత్రమే. ఒలింపిక్స్ క్రీడల్లో భారత అత్యుత్తమ ప్రదర్శనగా నాలుగో స్థానం 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో వచ్చింది. ఈ టీమ్‌లో ఎనిమిది మంది హైదరాబాద్ ఆటగాళ్లు ఉండటం విశేషం. మొత్తంగా 1948 నుంచి చూస్తే మన నగరం నుంచి 14 మంది ఒలింపియన్లు, 21 అంతర్జాతీయ ఫుట్‌బాలర్లు, 9 మంది కోచ్‌లు తమ ప్రతిభతో భారత ఫుట్‌బాల్‌పై చెరగని ముద్ర వేశారు. ఇదంతా ఘనమైన గతం. 1980వ దశకంలోకి వచ్చేసరికి ఆటలో ఆ కళ తప్పింది. వేర్వేరు కారణాలతో ఆటగాళ్ల ప్రదర్శన స్థాయి పడిపోతూ వచ్చింది. హైదరాబాద్ పోలీస్ టీమ్ కూడా బలహీనంగా మారిపోవడంతో ఫలితాలు రావడం ఆగిపోయాయి. ఆపై బెంగాల్, కేరళ జట్టు ఆటలో పూర్తిగా ఆధిపత్యం సాధించడం మొదలైంది. వీటికి తోడు గోవాతో పాటు ఈశాన్య రాష్ట్రాలు కూడా బలంగా దూసుకొచ్చాయి. మెలమెల్లగా హైదరాబాద్ ఫుట్‌బాల్ చివరి దశకు వచ్చేసింది. కనీసం ప్రతిభాన్వేషణ లేకపోవడం, టోర్నీల నిర్వహణ జరగకపోవడంతో సహజంగానే ఇక్కడ ఫుట్‌బాల్ మరింతగా దిగజారిపోయింది.

### 1962లో ఏషియన్ గేమ్స్‌లో ఎస్ఏ రహీమ్ జట్టు

### ఐఎస్ఎల్‌తో పెరిగిన ఆసక్తి..

దాదాపు రెండు దశాబ్దాల పాటు హైదరాబాద్ నగరంలో ఫుట్‌బాల్ నామ్‌కే వాస్తేగానే నడిచింది. అయితే అదృష్టవశాత్తూ కొత్త తరంలో మళ్లీ ఆటపై కాస్త ఆసక్తి పెరగడంతో పాటు అవకాశాలు రావడం మొదలు పెట్టాయి. ముఖ్యంగా పలు కార్పొరేట్ స్కూల్స్ ఫుట్‌బాల్‌ను ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా టీమ్‌లు తయారు చేసి జాతీయ స్థాయి పోటీల్లో బరిలోకి దించడంతో మళ్లీ హైదరాబాద్ పేరు వినిపించడం మొదలైంది. ప్రతిష్టాత్మక ఐ%-%లీగ్‌లో నగరానికి చెందిన 'శ్రీనిధి' దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ సత్తా చాటుతూ అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్)లో హైదరాబాద్ టీమ్ ఉండటం కూడా ఇక్కడి ఆటకు గుర్తింపు తెచ్చింది. ఈ టీమ్‌లో నేరుగా స్థానిక ఆటగాళ్లు లేకపోయినా హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్(హెచ్ఎఫ్‌సీ) ఇక్కడ అందరిలో ఆసక్తిని పెంచడంలో సఫలమైంది. గచ్చిబౌలి స్టేడియంలో ఐఎస్ఎల్ మ్యాచ్‌లకు వచ్చిన ఆదరణే అందుకు నిదర్శనం. దీంతో పాటు పలు ఫుట్‌బాల్ క్లినిక్‌లు, క్యాంప్‌ల ద్వారా హెచ్ఎఫ్‌సీ యువ ఆటగాళ్లకు మంచి అవకాశాలు కల్పించింది. దురదృష్టవశాత్తూ ఆర్థిక పరమైన కారణాలతో ఐఎస్ఎల్‌కు హెచ్ఎఫ్‌సీ దూరమైనా.. అది ఇక్కడ ఉన్నన్నాళ్లు మంచి ప్రభావం చూపగలిగింది.

### 1960 రోమ్ ఒలింపిక్స్‌లో భారత జట్టు

### ప్రైవేట్ క్లబ్‌ల చొరవతో..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే ఫుట్‌బాల్‌పై తన ఆసక్తిని ప్రదర్శిస్తున్నా గ్రౌండ్ లెవల్‌లో పరిస్థితి అంత గొప్పగా ఏమీ లేదు. తెలంగాణ జట్టు జూనియర్ స్థాయిలో విజయం సాధించి వచ్చి సీఎంను కలిసిన తర్వాత ఆయన ఆటను అభివృద్ధి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఎల్బీ స్టేడియంను ఫుట్‌బాల్‌కు కేంద్రంగా మారుస్తామని చెప్పినా.. మైదానం ఎప్పటిలాగే సౌకర్యాల లేమితో కనిపిస్తోంది. జింఖానా మైదానంలో కూడా చాలా పరిమితంగానే ఆడేందుకు అవకాశం లభిస్తోంది. ఏళ్లుగా టోర్నీల నిర్వహణకు ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. ఇలాంటి స్థితిలో 'శ్రీనిధి' యాజమాన్యం ఆటకు అండగా నిలుస్తోంది. అక్కడి మైదానాల్లో ప్రాక్టీస్, టోర్నీల నిర్వహణతో పాటు కుర్రాళ్లకు అవకాశాలు కల్పిస్తూ ఫుట్‌బాల్‌ను ప్రోత్సహిస్తోంది. తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం సొంత డబ్బులతోనే ఆటను రక్షించే ప్రయత్నం చేస్తుండటం సానుకూల అంశం. పాతబస్తీలోని చారిత్రాత్మక అబ్బాస్ క్లబ్, బొల్లారం క్లబ్‌లతో పాటు కొన్ని పాత క్లబ్‌లు మాత్రమే ఇంకా ఆటను బతికిస్తున్నాయి. దేశంలో ఎక్కడ టోర్నీ జరిగినా తమ జట్లను పంపి ఆయా క్లబ్‌కు ఫుట్‌బాల్‌తో తమ బంధాన్ని కొనసాగిస్తున్నాయి.


### ప్రభుత్వం తలచుకుంటే..

గత ఏడాది సెప్టెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఫుట్‌బాల్‌ను ప్రోత్సహిస్తామంటూ ఇంటర్ కాంటినెంటల్ కప్‌ను నిర్వహించింది. భారత్‌తో పాటు సిరియా, మారిషస్ జట్లు ఇందులో పాల్గొన్నాయి. టోర్నీ నిర్వహణ సమయంలో కూడా ప్రభుత్వం బాగా హడావిడి, ప్రచారం చేసింది. ఆ సమయంలో కూడా ముఖ్యమంత్రికి ఈ ఆటపై ఉన్న ఆసక్తి కనిపించింది. కానీ ఒక్కసారి టోర్నీ ముగియగానే అంతా గప్‌చుప్. ఇప్పుడు మెస్సీ రాకను కూడా ప్రభుత్వం ఒక పెద్ద ప్రచార కార్యక్రమంలా చూస్తోంది. నిజాయితీగా చూస్తే ఈ ప్రైవేట్ కార్యక్రమంతో ఒరిగేదేమీ ఉండదు.

### మెస్సీ కూడా తన పరిమితుల్లో కొద్దిసేపు

స్వల్పంగా పెనాల్టీలు ఆడి ఒక నాలుగు పాస్‌లు ఇచ్చి మమ అనిపిస్తాడు. కాబట్టి ఇప్పటికిప్పుడు ఈ ప్రోగ్రాం మన ఫుట్‌బాల్‌ను మార్చేయదు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాగైనా ఫుట్‌బాల్ రాతను మార్చాలనుకుంటే అది అసాధ్యమేమీ కాదు. ఆటను అభివృద్ధి చేయాలంటే ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాలు చాలా ఉన్నాయి. ఆపై ప్రతిభను ప్రోత్సహిస్తూ టోర్నీల నిర్వహణ ఒక క్రమంలో జరగాలి. దీనికి చాలా సమయం పడుతుంది. ఒక బృహత్ లక్ష్యంతో పని చేస్తే భారత ఫుట్‌బాల్‌లో మరోసారి నాటి హైదరాబాద్ మెరుపులు కనిపిస్తాయి.

# విటమిన్ ఇ మనకు ఎందుకు అవసరం..? రోజుకు ఎంత కావాలి..? వేటిని తినాలి..?



విటమిన్లు అనగానే చాలా మంది ఎ, బి, సి, డి విటమిన్లను గుర్తుకు తెచ్చుకుంటారు. కానీ ఇవే కాదు, ఇంకా అనేక విటమిన్లు మనకు కావల్సి ఉంటాయి. వాటిల్లో విటమిన్ ఇ కూడా ఒకటి. ఎ, డి విటమినల్లాగే విటమిన్ ఇ కూడా కొవ్వుల్లో కరుగుతుంది. కనుక విటమిన్ ఇ మన శరీరానికి లభించాలంటే శరీరంలో తగినంత కొవ్వు ఉండాలి. లేదా కొవ్వు పదార్థాలతో కలిపి దీన్ని తీసుకోవాల్సి ఉంటుంది. దీని వల్ల విటమిన్ ఇ ని శరీరం సులభంగా శోషించుకుంటుంది. ఇక విటమిన్ ఇ వాస్తవానికి విటమినే అయినప్పటికీ ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. కనుక మనకు ఇది రెండు విధాలుగా లాభాలను అందిస్తుంది. ఓ వైపు విటమిన్ ఇ గా పనిచేస్తూనే మరోవైపు యాంటీ ఆక్సిడెంట్ ప్రయోజనాలను అందిస్తుంది. ఇక విటమిన్ ఇ వల్ల మన శరీరం అనేక జీవక్రియలను సక్రమంగా నిర్వహిస్తుంది. అలాగే ఇది లోపిస్తే పలు లక్షణాలు, సంకేతాలను మన శరీరం తెలియజేస్తుంది.

### అనేక అవసరాలకు..

విటమిన్ ఇ మనకు చాలా స్వల్ప మోతాదులో అవసరం అవుతుంది. కానీ ఇది అనేక రకాల పనులను నిర్వర్తిస్తుంది. విటమిన్ ఇ వల్ల వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు లేదా అల్జీమర్స్ రాకుండా ఉండాలంటే విటమిన్ ఇ ఉండే ఆహారాలను రోజూ తినాలి. విటమిన్ ఇ వల్ల మూత్ర పిండాల పనితీరు మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్త నాళాల్లో కొవ్వు గడ్డ కట్టకుండా ఉంటుంది. దీంతో హార్ట్ ఎటాక్‌లు రాకుండా నివారించవచ్చు. అలాగే మెదడు పనితీరుకు, మెదడు యాక్టివ్‌గా ఉండేందుకు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగేందుకు, చర్మాన్ని సంరక్షించేందుకు, పురుషుల్లో ఉండే నపుంసకత్వ సమస్యను తగ్గించేందుకు, శిరోజాలను ఆరోగ్యంగా ఉంచేందుకు కూడా విటమిన్ ఇ మనకు సహాయం చేస్తుంది.

### విటమిన్ ఇ లోపిస్తే..

విటమిన్ ఇ లోపిస్తే మెదడు పనితీరు మందగిస్తుంది. మతిమరుపు పెరుగుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గుతాయి. యాక్టివ్‌గా ఉండలేరు. చురుకుదనం పోతుంది. ఆలోచనా శక్తి సన్నగిల్లుతుంది. చర్మం పొడిగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్లు, దురదలు వస్తాయి. శిరోజాలు చిట్లిపోయి అందవిహీనంగా మారుతాయి. నాడీ మండల వ్యవస్థ పనితీరు తగ్గిపోతుంది. నాడులు లేదా కండరాల నొప్పులు తరచూ వస్తుంటాయి. కొందరికి నీరసంగా ఉండి బలహీనంగా మారుతారు. చిన్న పని చేసినా అలసిపోతారు. కొందరికి గుండె కండరాలపై భారం పడి హార్ట్ ఎటాక్ వచ్చే చాన్స్ ఉంటుంది. కండరాలు క్షీణిస్తాయి. చిన్నారులు అయితే చదువుల్లో వెనుకబడతారు. కొందరికి కంటి చూపు మందగిస్తుంది. రాత్రి పూట రేచీకటి వచ్చే అవకాశాలు ఉంటాయి.

### ఎంత అవసరం, ఏమేం తినాలి..?

విటమిన్ ఇ వయస్సును బట్టి రోజుకు అవసరం అయ్యే పరిమాణం మారుతుంది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 6 నెలల వయస్సు ఉన్నవారికి రోజుకు 3 మిల్లీగ్రాముల విటమిన్ ఇ అవసరం అవుతుంది. అలాగే 6 నుంచి 12 నెలల వయస్సు ఉంటే. 4 మిల్లీగ్రాములు, 1 నుంచి 3 ఏళ్ల లోపు వారికి 6 మిల్లీగ్రాములు, 4 నుంచి 10 ఏళ్ల వయస్సు వారికి 7 మిల్లీగ్రాములు, ఆ పైన వయస్సు ఉండే వారికి రోజుకు 10 మిల్లీగ్రాముల మేర విటమిన్ ఇ అవసరం అవుతుంది. ఇక విటమిన్ ఇ లోపం ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మందులను వాడుకోవచ్చు. అలాగే పలు ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలు, గుమ్మడి విత్తనాలు, బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్, పల్లీలు, సోయాబీన్స్, పాలకూర, బ్రోకలీ వంటి ఆహారాలను తింటుంటే విటమిన్ ఇ అధికంగా లభిస్తుంది. దీంతో ఆరోగ్య ప్రయోజ నాలను పొందవచ్చు.

# ఐపీఎల్ వేలం కౌంట్ డౌన్ షురూ.. అతడికి రూ. 20 కోట్లు పైమాటే!

ఐపీఎల్-2026 మినీ వేలానికి సమయం అసన్నమవుతోంది. ఈ క్యాష్ రిచ్ లీగ్ వేలం డిసెంబర్ 16న అబుదాబి వేదికగా జరగనుంది. ఈ వేలం కోసం ఆయా ఫ్రాంచైజీలు తమ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి. అయితే ఈసారి వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడు ఎవరు అవుతారనే ఆసక్తి అందరిలో నెలకొంది. గత ఏడాది జెడ్డాలో జరిగిన వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషబ్ పంత్‌ను భారీ మొత్తం రూ. 27 కోట్లకు కొనుగోలు చేసింది. ఇదే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర. అయితే ఈసారి కూడా ఈ రికార్డు బద్దలయ్యే అవకాశం ఉంది, ఎందుకంటే ఫ్రాంచైజీల వద్ద మొత్తం పర్స్ విలువ రూ. 230 కోట్లకు పైగా ఉంది.

### పర్స్ బ్యాలెన్స్ అత్యధికం ఏ జట్టుదంటే?

ఐపీఎల్-2026 మినీ వేలంలో అత్యధిక పర్స్ వాల్యూ కోల్‌కతా నైట్‌రైడర్స్(64.30 కోట్లు) వద్ద ఉంది. ఆ తర్వాత స్థానాల్లో చెన్నై సూపర్ కింగ్స్ (43.40 కోట్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (25.50 కోట్లు), లక్నో సూపర్ జెయింట్స్ 22.95 కోట్లు ఢిల్లీ క్యాపిటల్స్ (21.80 కోట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(16.40 కోట్లు), రాజస్థాన్ రాయల్స్(16.05 కోట్లు), గుజరాత్ టైటాన్స్(12.90 కోట్లు), పంజాబ్ కింగ్స్ (11.50 కోట్లు), ముంబై ఇండియన్స్(2.75 కోట్లు) ఉన్నాయి. అత్యధికంగా కేకేఆర్ జట్టులో అత్యధికంగా 13 స్లాట్లు ఖాళీగా ఉన్నాయి. అత్యల్పంగా పంజాబ్ కింగ్స్‌లో నాలుగు స్థానాల్లో ఖాళీలు ఉన్నాయి.

### గ్రీన్‌పై కాసుల వర్షం!

ఈ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌పై కాసుల వర్షం కురిసే అవకాశముంది. గాయం కారణంగా గత సీజన్‌కు దూరమయ్యాడు. అయితే సాధారణంగా ఆల్-రౌండర్ అయిన గ్రీన్, ఈసారి వేలంలో తన పేరును 'బ్యాటర్ల' విభాగంలో నమోదు చేసుకున్నాడు. దీంతో వేలంలో మొదటి సెట్లలోనే అతడు పేరు వస్తుంది. మొదటిలో ఫ్రాంచైజీల వద పర్స్ మొత్తం ఫుల్‌గా ఉండడంతో అతడి కోసం పోటీ పడడం ఖాయం. గ్రీన్‌ను సొంతం చేసుకునేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్ , చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశముందని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. కేకేఆర్ సరైన పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ లేడు. గత సీజన్ వరకు జట్టులో ఉన్న ఆండ్రీ రస్సెల్‌ను కేకేఆర్ విడుదల చేసింది. ఆ తర్వాత అతడు ఏకంగా ఐపీఎల్‌కే రిటైర్మెంట్ ప్రకటించి కేకేఆర్ పవర్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఇప్పుడు అతడి స్థానాన్ని గ్రీన్‌తో భర్తీ చేయాలని కేకేఆర్ భావిస్తోంది. సీఎస్‌కే కూడా సామ్ కుర్రాన్‌ను రాజస్తాన్‌కు ట్రేడ్ చేయడంతో వారికి కూడా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అవసరం. కాబట్టి చెన్నై కూడా అతడిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. ప్రస్తుత రిపోర్ట్‌లు ప్రకారం.. అతడు వేలంలో రూ. 20 కోట్లకు పైగా ధర పలకడం ఖాయంగా కనిపిస్తోంది. గ్రీన్ చివరగా ఐపీఎల్ 2024లో ఆర్సీబీ తరపున ఆడాడు. ఆ సీజన్‌లో 255 పరుగులు చేయడంతో పాటు 10 వికెట్లు తీశాడు. ప్రస్తుతం అతడు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.

### బిష్ణోయ్ కోసం ఎస్ఆర్‌హెచ్ స్కెచ్!


కామెరూన్ గ్రీన్‌తో పాటు టీమిండియా స్పిన్నర్ రవి బిష్ణోయ్ కూడా భారీ ధరకు అమ్ముడు పోయే ఛాన్స్ ఉంది. గత సీజన్ వరకు లక్నోలో భాగంగా ఉన్న బిష్ణోయ్‌ను సదరు ఫ్రాంచైజీ వేలంలోకి విడిచిపెట్టింది. దీంతో స్పిన్ బౌలర్ల అవసరమున్న ఫ్రాంచైజీల అతడి కోసం పోటీ పడనున్నాయి. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ అతడిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. ఎస్ఆర్‌హెచ్ జట్టులో నాణ్యమైన స్పిన్నర్ ఒకరు లేరు. జీషన్ అన్సారీ ఉన్నప్పటికి అతడికి అంతర్జాతీయ స్థాయిలో అనుభవం లేదు. కాబట్టి బిష్ణోయ్‌ను తమ జట్టులోకి తీసుకోవాలని కావ్య మారన్ వ్యూహాలు రచిస్తోంది. అదేవిధంగా సీఎస్‌కే కూడా పోటీ పడే అవకాశముంది. ఎందుకంటే సీఎస్‌కేలో లెగ్ స్పిన్నర్ ఒక్కరూ కూడా లేరు. జడేజాను సైతం సీఎస్‌కే వదులుకుంది. మతీషా పతిరానా కోసం కూడా ఎస్ఆర్‌హెచ్ ప్రయత్నించే ఛాన్స్ ఉంది. మహ్మద్ షమీ స్థానాన్ని అతడితో భర్తీ చేయాలని ఆరెంజ్ ఆర్మీ భావిస్తుందంట.

### పృథ్వీషాపై సీఎస్‌కే కన్ను..

ఇక గత సీజన్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన పృథ్వీ షా.. ఈసారి మాత్రం ఫ్రాంచైజీలను ఆకర్షించే అవకాశం ఉంది. పృథ్వీషా ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ముంబై నుంచి మహారాష్ట్రకు మకాంను మార్చిన పృథ్వీ.. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా దుమ్ములేపుతున్నాడు. అతడిని సీఎస్‌కే సొంతం చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అతడితో సీఎస్‌కే యాజమాన్యం సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. దూకుడైన ఆటకు పృథ్వీ పెట్టింది పేరు.

### వెంకటేశ్ అయ్యర్‌కు షాక్ తప్పదా?

ఇక కేకేఆర్ మాజీ ఆల్‌రౌండర్, మధ్యప్రదేశ్ ఆటగాడు వెంకటేశ్ అయ్యర్‌కు మరోసారి షాక్ తగిలే అవకాశముంది. గత సీజన్‌లో అయ్యర్‌ను రూ. 23.75 కోట్ల భారీ ధరకు కేకేఆర్ కొనుగోలు చేసింది. కానీ అయ్యర్ తన ధరకు తగ్గ న్యాయం చేయలేకపోయాడు. దీంతో అతడిని నైట్‌రైడర్స్ వేలంలోకి విడిచిపెట్టింది. అయితే అయ్యర్ వేలంలోకి వచ్చినప్పటికి భారీ ధర దక్కే అవకాశం లేదు. ఎందుకంటే అతడు ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో దారుణ ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ ప్రభావం వేలంపై ఆడే అవకాశముంది.




Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620